# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644


**నీలగిరి నిత్యపద్యం**

కందం

సత్యమె పలుకుము నిత్యము
సత్యమె పుడమిన వెలుగును సంపద వోలెన్
సత్యము వీడిన వానికి
సత్యము నిక దాపురించు సంకటమెపుడున్

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 220 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 22-11 -2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


# పంచాయితీ రిజర్వేషన్లపై కసరత్తు

## నేడు జివో విడుదల చేయనున్న పంచాయితీరాజ్ శాఖ

### ఒకటి రెండు రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు




**హైదరాబాద్, నవంబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** పంచాయితీ ఎన్నికలకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామ పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్ల విధి విధానాలు పంచాయతీరాజ్ శాఖ ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం జీవో ఇవ్వనుంది. రిజర్వేషన్లు 50శాతం మించకుండా కొత్త రిజర్వేషన్లను సిఫార్సు చేస్తూ డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి గురువారం నివేదిక సమర్పించింది. డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులను సర్క్యులేషన్ విధానంలో రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. మంత్రుల వద్దకు ఫైలు పంపించి ఆమోదిస్తున్నట్లు సంతకాలు తీసుకున్నారు. -మిగతా 2 లో




# రూ.5 లక్షల కోట్ల భూకుంభకోణం

## హైదరాబాద్‌లో విలువైన భూములపై సీఎం రేవంత్‌రెడ్డి కన్ను



9,292 ఎకరాల భూమిని ప్రయివేటు వ్యక్తులకు అప్పగించే కుట్ర

- హెచ్‌ఐఎల్‌టీపీ విధానం దేశ చరిత్రలోనే పెద్ద స్కాం
- ఆ భూములను పారిశ్రామికవేత్తలు తీసుకోవద్దు
- ఎవరు తీసుకున్నా మా ప్రభుత్వం వచ్చాక ఇబ్బందులు తప్పవు
- దీనిపై న్యాయపోరాటం చేస్తాం
- ఆ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలి
- ఫార్ములా ఈ కారు రేస్‌లో నా తప్పులేదు
- లైడిటెక్టర్ టెస్టుకు సిద్ధమే : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ నవంబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** హైదరాబాద్‌లో విలువైన భూములపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కన్ను పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. రూ.ఐదు లక్షల కోట్ల భూ కుంభకోణానికి తెరలేపారని సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన హైదరాబాద్ ఇండిస్టియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ (హెచ్‌ఐఎల్‌టీపీ) పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి -మిగతా 2 లో



# దుబాయ్ ఎయిర్ షోలో విషాదం

- కూలిన భారత యుద్ధ విమానం 'తేజస్' : పైలట్ మృతి
- ఆకాశంలో అలుముకున్న నల్లటి పొగ

**దుబాయ్**
దుబాయ్ ఎయిర్ షోలో భారత్‌కు చెందిన తేజస్ ఫైటర్ జెట్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన పైలట్ మృతి చెందాడు. భారత వాయుసేనలో వినియోగిస్తున్న యుద్ధ విమానం హెచ్ఏఎల్ తేజస్ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం సమయంలో ప్రదర్శన చేస్తూ ఒక్కసారిగా నేలను తాకి కూలిపోయింది. దీంతో క్షణాల వ్యవధిలోనే మంటలు చేలరేగి ఫైటర్ జెట్ పూర్తిగా దగ్ధమైంది. దట్టమైన పొగలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంలో పైలట్ మృతి చెందినట్టు భారత వైమానిక దళం ధ్రువీకరించింది. ఇందుకు తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఆయన కుటుంబానికి సానుభూతి ప్రకటించింది. ఈ ప్రమాదానికి గల కారణంపై విచారణకు ఆదేశిస్తున్నట్టు తెలిపింది.
ఆకాశంలో అలుముకున్న నల్లటి పొగ
ఫైటర్ జెట్ కూలిన నేపథ్యంలో విన్యాసాలు జరుగుతున్న దుబాయ్ వరల్డ్ సెంట్రల్‌లోని అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద నల్లటి పొగ ఆకాశాన్ని అలుముకుంది. ఈ క్రమంలో ఒక్కసారిగా సైరన్లు మోగాయి. యుద్ధ విమానం -మిగతా 2 లో



# హైదరాబాద్‌లో రాష్ట్రపతి

- గవర్నర్, సీఎం స్వాగతం
- భారతీయ కళా మహోత్సవాన్ని ప్రారంభించిన ద్రౌపదీ ముర్ము
- శనివారం ఉదయం 9.30 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి పుట్టపర్తికి వెళ్లనున్నారు.

**హైదరాబాద్ నవంబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హైదరాబాద్ చేరుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హైదరాబాద్ సీపీ సజ్జనార్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ఆమె రాజ్‌భవన్ చేరుకుని అక్కడే లంచ్ అనంతరం -మిగతా 2 లో

# తెలంగాణలో 32 మంది ఐపీఎస్‌ల బదిలీ

- స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తువేళ భారీగా ఐపీఎస్‌ల బదిలీ
- పలు జిల్లాలకు కొత్త ఎస్పీల నియామకం
- అడిషనల్ డీజీగా జయేంద్రసింగ్ చౌహాన్,
- ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్,**
తెలంగాణలో స్థానిక ఎన్నికలకు రంగం సిద్దంచేస్తున్న వేళ ప్రభుత్వం భారీ ఎత్తున పోలీస్ అధికారులను బదిలీ చేసింది. పలు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించింది.




డిసెంబర్‌లో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నోటిఫికేషన్ వస్తే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. దీంతో ముందుగానే ప్రభుత్వం ఐపిఎస్‌లను బదిలీ చేసినట్లు అర్థం అవుతోంది. ప్రస్తుతం ఉన్న వారిలో చాలామందిని బదిలీ చేసింది. -మిగతా 2 లో

# బంగ్లాదేశ్‌లో భూ ప్రకంపనలు

- రిక్టర్ స్కేలుపై భూప్రకంపనల తీవ్రత 5.2 మాగ్నిట్యూడ్‌గా నమోదు
- నార్సింగ్డికి 14 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం
- కోల్‌కత్తా పరిసరాలోను ప్రభావం

**ఢాకా,**
పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో భారీ భూప్రకంపనలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై భూప్రకంపనల తీవ్రత 5.2 మాగ్నిట్యూడ్‌గా నమోదు అయింది. శుక్రవారం ఉదయం 10 గంటల 8 నిమిషాల ప్రాంతంలో ఘోరాశల్ దగ్గర భూప్రకంపనలు సంభవించాయి. యునైటెడ స్టేట్స్ జియోలాజికల్ సర్వే ప్రకారం.. నార్సింగ్డికి 14 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉంది. ఇక, బంగ్లాదేశ్‌లో భూకంపం రావటంతో కోల్‌కతాతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించింది. ఇళ్లలోని ఫ్యాన్లతో పాటు ఇతర వస్తువులు అటు, ఇటు ఊగాయి. దీంతో జనం భయపడిపోయారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పెద్ద సంఖ్యలో జనం వీధుల్లోకి వచ్చి చేరారు. అయితే, భూ ప్రకంపనల కారణంగా -మిగతా 2 లో




# అబద్దాల ప్రచారంలో కేటీఆర్ దిట్ట

## గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలకు మేం దూరం

- ఉపాధి, ఉద్యోగాల కోసం పెట్టుబడుల వేట
- గతంలో ఇచ్చిన జీవోల ఆధారంగానే భూ కేటయింపులు
- ఎవ్వరికీ భూములు దోచిపెట్టే పరిస్థితి లేదు
- కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,నవంబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు అసత్యాలు చెబుతున్నాని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం సిఎం రేవంత్ నేతృత్వంలో పెట్టుబడుల కోసం, ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నదని అన్నారు. అచిర కాలంలోనే తెలంగాణ అనేక విజయాలు సాధించిందని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా అడ్డగోలుగా జీవోలు, చెల్లింపులు చేయడం లేదని, వారి హయాంలో ఏం చేసినా దాని వెనుక ఓ మతలబు ఉండేదని -మిగతా 2 లో





# పిపిపి ఆస్పత్రుల్లో పేదలకు 70శాతమే

## 30 శాతం పడకలు ప్రైవేటుకు

- ఏప్రిల్ నుండి యూనివర్సల్ హెల్త్ స్కీమ్
- సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి నవంబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** రాష్ట్రంలో నూతనంగా నిర్మిస్తున్న పిపిపి వైద్య కళాశాలల అనుబంధ ఆస్పత్రులలో పేదలకు 70 శాతం పడకలను మాత్రమే కేటాయించనున్నారు. ప్రైవేటుకు మిగిలిన 30 శాతం పడకలను అప్పగించనున్నారు. మెడికల్ కళాశాలల నిర్మాణం, కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలు, యూనివర్సిల్ హెల్త్ స్కీంలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు 'కొత్త మెడికల్ కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రుల్లో 70శాతం మేర -మిగతా 2 లో

# త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ

- ఏటీసీలుగా 65 ఐటీఐ కళాశాలల మార్పు
- జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకల్లో డిప్యూటీ సీఎం



2 లో

# పంచాయితీ రిజర్వేషన్లపై కసరత్తు

మొదటి తరువాయి

ఈ క్రమంలో పంచాయతీలు, వార్డుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లపై విధివిధానాలు ఖరారు చేస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేయనుంది. జీవోకు అనుగుణంగా ఎంపీడీవోలు వార్డులకు, ఆర్డీవోలు సర్పంచి పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. రాజకీయ పార్టీల సమక్షంలో లాటరీ పద్ధతిలో మహిళలకు సీట్లు కేటాయించనున్నారు. శని, ఆదివారాల్లో జిల్లాల యంత్రాంగం రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయనుంది. రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాత పంచాయతీ ఎన్నికలకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాయనుంది. ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నామని, పిటిషన్‌పై విచారణ ముగించాలని ఈనెల 24న హైకోర్టుకు ప్రభుత్వం, ఎస్ఈసీ తెలపనున్నాయి. హైకోర్టు అంగీకరిస్తే అదే రోజు లేదా మరుసటి రోజు షెడ్యూలు విడుదల చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. మొత్తానికి ఇటీవల కేబినేట్‌లో ఆమోదించిన మేరకు డిసెంబర్ రెండోవారంలో నోటిఫికేషన్ విడుదల కానుంది.

# దుబాయ్ ఎయిర్ షోలో విషాదం



మొదటి తరువాయి

ఒక్కసారిగా కూలి మంటలు చెలరేగిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నెగెటివ్ జీ-ఫోర్స్ టర్న్ నుంచి పైలట్ యుద్ధవిమానాన్ని వెనక్కి మళ్లించే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం. ప్రపంచంలోనే అతిపెద్ద వైమానిక ప్రదర్శన అయిన దుబాయ్ ఎయిర్‌షోలో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలకు చెందిన విమానయాన సంస్థలు పాల్గొని సందడి చేస్తాయి.

# హైదరాబాద్‌లో రాష్ట్రపతి

మొదటి తరువాయి



కొద్ది సేపు విశ్రాంతి తీసుకున్నారు. అక్కడ్నుంచి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం చేరుకుని అక్కడ భారతీయ కళా మహౌత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమం అనంతరం ఆమె తిరిగి రాజ్‌భవన్ చేరుకుని అక్కడే రాత్రికి బస చేయనున్నారు. శనివారం ఉదయం అక్కడే అల్పాహారాన్ని తీసుకుని ఆమె ఉదయం 9.30 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి పుట్టపర్తికి వెళ్లనున్నారు.

# త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ

**ఏటీసీలుగా 65 ఐటీఐ కళాశాలల మార్పు**

**జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకల్లో డిప్యూటీ సీఎం**



హైదరాబాద్,

65 ఐటీఐ కళాశాలలను ఏటీసీలుగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. జేఎన్‌టీయూ ఒక విశ్వవిద్యాలయం మాత్రమే కాదని.. ఇది దేశానికి, ముఖ్యంగా తెలంగాణకు గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు. ఇంజనీర్లను తయారు చేసే శక్తివంతమైన దేశ ఇంజిన్ అని ప్రశంసించారు. విద్యార్థుల ప్రతిభ ప్రపంచానికి ఎంతో గర్వకారణమన్నారు. విద్య అనేది ఖర్చు కాదని, భవిష్యత్తును నిర్మించే పెట్టుబడని విద్యార్థులకు భట్టి విక్రమార్క సందేశం ఇచ్చారు. ఉద్యోగాలు వెతికే వారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే వారిగా ఎదగాలని సూచించారు. మొదటి 60 ఏళ్ల కంటే, వచ్చే 60 ఏళ్లు మరింత మహోన్నతంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు.

# రూ.5 లక్షల కోట్ల భూకుంభకోణం

మొదటి తరువాయి




కోట్ల భూకుంభకోణానికి పాల్పడాలని చూస్తున్నారని అన్నారు. భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద భూ కుంభకోణమని కేటీఆర్ అభివర్ణించారు.

ఈ విధానం ముఖ్యమంత్రికి సన్నిహితంగా ఉండే రాజకీయ మధ్యవర్తులు, బంధువులు, రియల్ ఎస్టేట్ గ్రూపులకు లబ్ధి చేకూర్చేందుకే రూపొందించబడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ, మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెచ్ఐఎల్‌టీపీ వాస్త వానికి వేలాది ఎకరాల పారిశ్రామిక భూములను అత్యంత తక్కువ ధరకు బహుళ-ఉపయోగ విలువైన రియల్ ఎస్టేట్‌గా మార్చడానికి రూపొందించబడిందని అన్నారు. ఇది కేవలం ప్రభుత్వ విధానం మాత్రమే కాదనీ, రూ.ఐదు లక్షల కోట్ల కుంభకోణం కోసం రూపొందించిన బ్లూప్రింట్ ఆరోపించారు. దీనిద్వారా సీఎం రేవంత్‌రెడ్డి రూ.40 వేల కోట్ల నుంచి రూ.50 వేల కోట్ల వరకు కొల్లగొట్టాలని చూస్తున్నారని వివరించారు. పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ ముసుగులో, రేవంత్‌రెడ్డి భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద భూ కుంభకోణానికి తెరలేపారని అన్నారు.

**ఆ భూములకు బహిరంగవేలం నిర్వహించాలి**

హైదరాబాద్‌లోని బాలానగర్, జీడిమెట్ల, సనత్‌నగర్, అజామాబాద్‌తోసహా కీలకమైన పారిశ్రామిక క్లస్టర్లలో ఉన్న సుమారు 9,292 ఎకరాల విలువైన భూమిని క్రమబద్ధీకరించడానికి ఈ విధానాన్ని ప్రభుత్వం తెచ్చిందని కేటీఆర్ చెప్పారు. ఈ భూముల మార్కెట్ విలువ ప్రస్తుతం ఎకరాకు రూ. 40 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఉందని వివరించారు. దీని విలువ మొత్తం రూ.4.50 లక్షల కోట్ల నుంచి రూ.ఐదు లక్షల కోట్ల మధ్య ఉంటుందని చెప్పారు. ఆ భూములను రేవంత్‌రెడ్డి కేవలం ప్రభుత్వ విలువలో 30 శాతానికే అప్పగించాలని చూస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అజామాబాద్ పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరిం చినప్పుడు, ఎస్ఆర్ఓ రేట్ల కంటే 100 శాతం నుంచి 200 శాతానికి అధికంగా వసూలు చేయాలని చట్టం చేశామని గుర్తు చేశారు ఆ చట్టాన్ని సవరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 30 శాతానికే కట్టబెట్టాలని చూస్తోందన్నారు. ఎందుకు? ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరికి లాభం చేకూర్చడానికి? అని కేటీఆర్ ప్రశ్నించారు. మార్కెట్ ధరలు, ఎస్ఆర్ఓ విలువ కంటే నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. కనీసం ఎస్ఆర్ఓను కూడా పూర్తిగా వసూలు చేయడం లేదన్నారు. ప్రభుత్వానికి డబ్బు అవసరమైతే ఆ భూములను బహిరంగ వేలం వేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ వ్యక్తులకు ప్రయోజనం కలిగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు.

# అబద్ధాల ప్రచారంలో కేటీఆర్ దిట్ట

మొదటి తరువాయి

ఆరోపించారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మా కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలపై కేటీఆర్ ఆరోపణలు చేశారు. మొత్తం 9,292 ఎకరాల భూమి గురించి మాట్లాడారు. పరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రభుత్వం భూములను తక్కువ ధరకు ఇస్తోంది. 2023లో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం మూడు జీవోలు ఇచ్చింది. ఆ జీవో ప్రకారం హైదరాబాద్‌లోని భూములను ట్రాన్స్‌ఫర్‌కు అనుమతి ఇచ్చారు. ప్రభుత్వ భూమి అమ్ముకున్నట్టు కేటీఆర్ మాట్లాడుతున్నారు. ఫ్రీహోల్డ్, ల్యాండ్ లీజ్‌కు తేడా లేకుండా మాట్లాడారు. 2023లో భారత రాష్ట్ర సమితి తెచ్చిన జీవో ప్రకారమే భూములు ఇస్తున్నాం. భూమి హక్కులు ఉన్న వారికి మేలు చేయాలని చూస్తున్నాం. గత ప్రభుత్వం హయాంలో చాలా భూములు బదిలీ చేశారు. పరిశ్రమలకు ఉపయోగపడాలని గ్రిడ్ పాలసీ తీసుకున్నారని అనుకున్నాం. పారిశ్రామిక వేత్తలను ఇబ్బంది పెట్టకూడదు. పెట్టుబడులు రావాలని రాయితీలతో కూడిన

పాలసీలు తీసుకుంటాం. కొన్ని రాష్ట్రాల్లో 99 పైసలకే భూములు ఇస్తున్నారు. పెట్టుబడులు రావాలి, ఉపాధి పెంచాలి అనేది మా లక్ష్యం. ఫ్రీహోల్డ్ ల్యాండ్ ఉన్నవారు పాలసీ ద్వారా అవకాశం ఉంటే దరఖాస్తు చేసుకుంటారని అన్నారు. భారత రాష్ట్ర సమితి నేతలు అభూత కల్పనలతో రాష్ట్ర ప్రజలకు సత్యదూరమైన మాటలు చెబుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తర్వాత ఆ పార్టీ నేతలకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. పెట్టుబడులు రాకూడదు, రాష్ట్ర అభివృద్ధి జరగకూడదు అనేది కేటీఆర్ ఆలోచన. ఆధారాలు ఉంటేనే మాట్లాడాలి. కేటీఆర్ కొంత మంది పేర్లు చెప్పారు.. వారు ప్రభుత్వంలో లేరు. ఆధారాలు ఉంటే చెప్పండి.. చర్యలు తీసుకుంటాం అని శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా అబద్ధాల ప్రచారం మానుకోవాలన్నారు. గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలు జరగడం లేదన్నారు. స్వలాభం అన్నదానికి వారు హయాంలో తీసుకున్న నిర్ణయాలే నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు.

# పిపిపి ఆస్పత్రుల్లో పేదలకు 70శాతమే

మొదటి తరువాయి



పడకలు పేదలకు ఉచితంగా కేటాయిస్తున్నాం' అని ఆయన చెప్పారు. అంటే, ఈ 70 శాతం పడకల మేర మాత్రమే ఉచిత వైద్య సేవలు అందనున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో 100శాతం మేర పేదలకు ఉచిత వైద్య సేవలు అందుతున్న విషయం తెలిసిందే. సమీక్షలో సిఎం మాట్లాడుతూ మెడికల్ కళాశాలలు పిపిపి విధానంలో చేపడుతున్నా పర్యవేక్షణ, అజమాయిషీ మాత్రం ప్రభుత్వం చేపడుతుందని చెప్పారు. ఈ కళాశాలల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి వచ్చేలా చూడాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా వివిధ మోడళ్లల్లో నిర్వహిస్తున్న ఆస్పత్రులను అధ్యయనం చేయాలన్నారు. రోగులకు మెరుగైన, నాణ్యమైన సేవలు సులభంగా అందాలని, ప్రభుత్వ ప్రమాణాల ప్రకారం పనిచేసేలా చూడాలని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేయనున్న యూనివర్సిల్ హెల్త్ ఇన్సూరెన్స్ విధానాన్ని 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తేవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో ఏ వ్యాధికి ఎంత వ్యయం చేస్తున్నామో విశ్లేషించాలని సూచించారు. ప్రజారోగ్యంలో ప్రివెంటివ్, క్యురేటివ్ విధానం ద్వారా వైద్యారోగ్యం రంగంపై ప్రభుత్వం చేస్తున్న వ్యయంతో పాటు ప్రజల వ్యక్తిగత వ్యయం కూడా తగ్గేలా చూడాలని పేర్కొన్నారు. కుప్పంలో పైలట్‌గా అమలు చేస్తున్న డిజినెర్వ్ సెంటర్ సంజీవని ప్రాజెక్టు రాష్ట్రానికి ఓ గేమ్ చేంజర్‌గా మారుతుందని, వైద్య రంగంలో దేశానికి ఓ దిక్సూచిగా నిలిచే అవకాశం ఉంటుందన్నారు. డిజిటల్ హెల్త్ రికార్డుల ద్వారా ప్రజారోగ్యాన్ని పర్యవేక్షిస్తామని కుప్పం ప్రాజెక్టుపై అధికారులు సిఎంకు వివరించారు. జనవరి 1 నుంచి చిత్తూరు మొత్తం సంజీవని ప్రాజెక్టు ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రమంతా కూడా ఈ ప్రాజెక్టును విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సంజీవని ప్రాజెక్టు సమర్ధంగా అమలు చేస్తే వైద్యరంగంలో ప్రభుత్వం చేసే వ్యయం గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సేకరించిన డేటాను విశ్లేషించేందుకు ఓ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్‌గా పాల్గొన్న ఈ సమావేశంలో ఆ శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, కమిషనర్ వీరపాండియన్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 32 మంది ఐపీఎస్‌ల బదిలీ

మొదటి తరువాయి

ఈ క్రమంలో మొత్తం 32 మంది ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అడిషనల్ డీజీగా జయేంద్రసింగ్ చౌహాన్, సీఐడీ డీజీగా పరిమళ హన నూతన్ జాకబ్, పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా చేతన్ మైలబత్తుల, మహేశ్వరం జోన్ డీసీపీగా కే నారాయణ రెడ్డి, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా పీవీ పద్మజలు నియమితులయ్యారు. ఇక నాగర్‌కర్నూల్ ఎస్పీగా సంగ్రామ్ సింగ్, హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా కిరణ్ ప్రభాకర్, మహబూబాబాద్ ఎస్పీగా శబరీష్, కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీగా నిఖిత, టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా గిరిధర్, వికారాబాద్ ఎస్పీగా స్నేహ మిశ్రా బదిలి అయ్యారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా గైక్వాడ్ వైభవ్, ములుగు ఎస్పీగా కేకన్ సుధీర్ రామ్‌నాథ్, జయశంకర్ భూపాలపల్లి ఎస్పీగా సంకీర్త్, గవర్నర్ ఏడీసీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్, పెద్దపల్లి డీసీపీగా రామ్ రెడ్డి, మల్కాజ్‌గిరి డీసీపీగా సీహెచ్ శ్రీధర్, భద్రాద్రి కొత్తగూడెం అడిషనల్ ఎస్పీగా అవినాష్ కుమార్, భువనగిరి అడిషనల్ ఎస్పీగా కంకణాల రాహుల్ రెడ్డి, జగిత్యాల అడిషన్ ఎస్పీగా శేషాద్రిని రెడ్డి, ములుగు అడిషనల్ ఎస్పీగా శివం ఉపాధ్యాయ, ఆదిలాబాద్ అదనపు ఎస్పీగా మౌనిక, ఏటూరు నాగారం ఏఎస్పీగా మనన్ భట్, నిర్మల్ ఏఎస్పీగా సాయికిరణ్, వేములవాడు ఏఎస్పీగా రుత్విక్ సాయి, సత్తుపల్లి ఏసీపీగా యాదవ్ వసుంధర, టీజీ ట్రాన్స్‌కో ఎస్పీగా శ్రీనివాస్, వనపర్తి ఎస్పీగా సునీత నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# బంగ్లాదేశ్‌లో భూ ప్రకంపనలు

మొదటి తరువాయి




ఎవరైనా చనిపోయారా? లేక గాయాలు అయ్యాయా? అన్న దానిపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. భూ ప్రకంపనలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియ రావాల్సి ఉంది. బంగ్లాదేశ్‌లో భూ ప్రకంపనలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ వీడియోలో ఢాకాలోని బద్దా లింక్ రోడ్ ఏరియాలోని ప్రజలు పెద్ద సంఖ్యలో వీధిలోకి వచ్చి నిలబడ్డారు. పక్కన ఉన్న అపార్ట్‌మెంట్స్ స్వల్పంగా కంపిస్తూ ఉన్నాయి. జనం భయంభయంగా అటు, ఇటు చూస్తూ ఉన్నారు. కొంతమంది వాటిని వీడియో తీస్తూ ఉన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి -పిసీసీ సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్**



**కడ్తాల్, నవంబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** పేదల సొంతింటి కలను నేరవేర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించిందని టీపీ సీ సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా రంజక పాలనను ప్రజలు స్వాగతించారని ఇందిరమ్మ రాజ్యం తెచ్చిన ఘనత ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కే దక్కుతుందని ప్రజా పాలన లో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని ఆయన పెర్కోన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం లో రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో వందల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నారని గత ప్రభుత్వం పదేళ్ల నుండి ఒక్క ఒక్క ఇల్లు ఇచ్చిన పాపానా పోలేదని అర్హులైన వారికీ అందరి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తున్నారని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కడ్తాల మండలం కర్కల్ పహాడ్ గ్రామంలో ఉడుతల నీలా మల్లేష్ దంపతులు గారి ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డి సీ సీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బిక్య నాయక్ , పంచాయతీ కార్యదర్శి జంగయ్య, జిల్లా నాయకులు జాటోవత్ జవహర్ లాల్ నాయక్ , రంగారెడ్డి జిల్లా కో -కో ఆర్డినేటర్ విష్ణు , అయోధ్య గ, ఇందిరమ్మ కమిటీ మెంబర్ సయ్యద్ జలాలుద్దీన్, ఇందిరమ్మ కమిటీ మెంబర్ పట్నం శివరాజు , యూత్ కాంగ్రెస్ నాయకులు తుల్సి రాం నాయక్, మల్లేష్ కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# యువత స్వయంకృషితో అన్ని రంగాలలో రాణించాలి

**డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా**



**కడ్తాల్, నవంబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** : ప్రస్తుతం చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులు తల్లిదండ్రులపై ఆధారపడకుండా తమ కాళ్లపై నిలబడి స్వయంకృషితో తమకు నచ్చిన రంగాలలో రాణించాలని డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. శుక్రవారం కడ్తాల్ మండలంలోని మిల్క్ చిల్లింగ్ సెంటర్ ఆవరణలో ఉన్న కాంప్లెక్స్ లో యాదయ్య కుమారుడు రాము ఏర్పాటు చేసుకున్న కిరాణా షాపు, వెజిటేబుల్ మార్కెట్ ను ఆయన చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న యువత మారకద్రవ్యాలకు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. యువత ఒకరిపై ఆధారపడకుండా స్వయంకృషితో ఎదిగినప్పుడే దేశం అభివృద్ధిలో పయనిస్తుందని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు రాలేదని నిరాశ చెందకుండా తమలో ఉన్న ప్రతిభను వెలికి తీసి స్వయంకృషితో ఎదగాలని అన్నారు. అనంతరం రాము కుటుంబ సభ్యులను వెంకటేష్ గుప్తా శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పాండు నాయక్, సిద్ధిగారి సురేష్, సిద్ది గారి దాసు, శ్యాంసుందర్ గౌడ్, నాగార్జున, రాయకంటి సురేష్, జగదీష్ గౌడ్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు వి వీరేందర్ గుప్తా, సాయి గుప్తా, రవి గుప్తా, సురేష్, మైనార్టీ సెల్ నాయకుడు షఫీ తదితరులు పాల్గొన్నారు.

# చెంచుల సమస్యల పరిష్కారానికి చెంచుల చెంతకే వెళ్లిన జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి.



**నల్లగొండ,నవంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి సీరియస్ గా ప్రజల వద్దనుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఇంతలో నల్గొండ జిల్లా ,తిరుమలగిరి సాగర్ మండలం ,నెల్లికల్ చెంచువాని తండా కు చెందిన ఆదెమ్మ ఒక పిటీషన్ ను ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు సమర్పించింది. అందులో ప్రధానంగా తమ తండాలో ఆధార్ కార్డులు, వివిధ ధ్రువపత్రాలు లేనందున తమ తాండవాసులందరూ ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్నామని, మారుమూల గిరిజన ప్రాంతంలో ఉండే తమకు ప్రభుత్వ లబ్ధి అందటం లేదని అందులో పేర్కొంది. ఈ విషయాన్ని సావధానంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఒక చెంచు మహిళ సుదూర ప్రాంతం నుండి నల్గొండకు వచ్చి సమస్యలను చెప్పడంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి నేరుగా నెల్లికల్ చెంచు వాని తండాకే వెళ్లి చెంచు తండావాసుల సమస్యలు పరిష్కరించాలని నిర్ణయించారు.వెంటనే నాగార్జున సాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డితో మాట్లాడి చెంచులు సమస్యల పరిష్కారానికి నెల్లికల్ చెంచు వాని తాండకి వెల్దామని,అందుకు సమయం కేటాయించాలని కోరారు. అందుకు ఎం ఎల్ ఏ జయవీర్ రెడ్డి అంగీకరించడంతో శుక్రవారం ఉదయం 8 గంటలకే జిల్లా కలెక్టర్ , జిల్లా అధికారులతో సహా శాసనసభ్యులు కుందూరు జయ వీర్ రెడ్డితో కలిసి నెల్లికల్ చెంచుతాండకి చేరుకున్నారు.ఉదయమే తమ తండా కు వచ్చిన జిల్లా కలెక్టర్ ,ఎం ఎల్ ఏ లను చూసి చెంచు ప్రజలు సంతోషం తో స్వాగతం పలికారు అనంతరం తమ సమస్యలను కలెక్టర్ మరియు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు ఇట్టి సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు ఉదయం 8 గంటలకే జిల్లా అధికార యంత్రాంగం తో సహా నెల్లికల్ చెంచు వాని తండా సందర్శన.తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ తమ వద్దకే వచ్చినందుకు చెంచులు.సంతోషంతో కృతజ్ఞతలు తెలిపారు.

# అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

**కుల వృత్తులను ప్రోత్సహిస్తున్నాం : సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందుకోసం నిరంతరం కృషి చేస్తున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో లోయర్ మానేరు జలాశయంలో చేప పిల్లల ఉచిత పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని జలాశయంలో చేప పిల్లలను విడుదల చేశారు.ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా రూ. 2 కోట్ల 18 లక్షల వ్యయంతో 2 కోట్ల 20 లక్షల చేప పిల్లలను చెరువులు, కుంటలు, జలాశయాల్లో విడుదల చేస్తున్నామని తెలిపారు. 80 -100 మిల్లీమీటర్ల పరిమాణంలో ఉన్న ఈ చేప పిల్లల ద్వారా సుమారు 2500 మంది మత్స్యకారులు ప్రత్యక్షంగా, 1300 మంది పరోక్షంగా జీవనోపాధి పొందుతారని వివరించారు. ఎల్ఎండిలో 30 లక్షల చేపలను విడుదల చేస్తున్నామని చెప్పారు.ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం కుల వృత్తులను ఆదరిస్తూనే ఉందని, గత ప్రభుత్వ కాలంలో పెండింగ్‌లో ఉన్న మత్స్యశాఖ కాంట్రాక్టర్ల బకాయిలను విడుదల చేసేలా కృషి చేస్తామని తెలిపారు. మత్స్యకారుల సొసైటీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకార్మికుని కుటుంబానికి రూ. 5 లక్షల బీమా చెక్కును అందజేశారు. జిల్లాలో మొట్టమొదటగా ఏర్పాటు చేసిన మహిళా మత్స్యకార్మిక సహకార సంఘానికి రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందజేశారు. కొత్తగా సభ్యత్వం పొందిన మత్స్యకారులకు నమోదు పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకార్మిక సంఘం చైర్మన్ పిట్టల రవీందర్, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయభారతి, మత్స్యకార్మిక సహకార సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# అడవిదేవులపల్లి మండల సీఐటీయూ కొత్త కన్వీనర్‌గా రాంబాబు ఎన్నిక



**అడవిదేవులపల్లి, నవంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)** అడవిదేవులపల్లి మండల సీఐటీయూ నూతన కన్వీనర్‌గా చినేని రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. తాపీ వర్కర్లు, ఆశా వర్కర్లు, అంగనవాడి సిబ్బంది, మున్సిపాలిటీ కార్మికులు, హమాలీల సమస్యలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పరిష్కారం చూపుతానని ఆయన హామీ ఇచ్చారు. ఈ నెల 29, 30 తేదీల్లో జరగనున్న మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కన్వీనర్ బాధ్యత నాపై నమ్మకం ఉంచి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను అని రాంబాబు పేర్కొన్నారు. సీఐటీయూ వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ నగర్ లో మాజీ కౌన్సిలర్ ఈగల రాములు గురుస్వామి నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజా కార్యక్రమంలో పాల్గొన్న ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి.

# రైతులతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమావేశం



**కడ్తాల్, నవంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** : మండలంలోని ముద్వేన్ రెవిన్యూ పరిధిలోని ఎక్వాయిపల్లి, మర్రిపల్లి, కోనాపూర్, ముద్వేన్ గ్రామ రోడ్డు నిర్వసితులతో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి శుక్రవారం కొంత మంది రైతులతో కడ్తాల్ లో సమావేశం నిర్వహించారు, రైతుల తరుపున రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో సంభాషించారు. ఈ సందర్భంగా రైతులకు న్యాయం జరగాలని లేని పక్షంలో ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు తగిన నష్టపరిహారం ఇపిస్తానని, అన్ని విధాలుగా రైతులను ఆదుకొనే విదంగా తగు చర్యలు తీసుకుంటాతనని తెలిపారు. ఈ సమావేశం లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, తెలంగాణ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పాలకుర్ల రవికాంత్ గౌడ్, ఫాక్స్ డైరెక్టర్ జోగు వీరయ్య, పాలకుర్ల కరుణాకర్, వెంకట్ రెడ్డి, సుమన్, నారాయణ, పాండు రంగా రెడ్డి, జెన్నయ్య, శంకరయ్య, పాండు, మల్లయ్య, హరిష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ?

# కడ్తాల్ -సాలర్ పూర్ బిటీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



**కడ్తాల్, నవంబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** కడ్తాల్ మండల కేంద్రం నుంచి వంపుగూడ, చల్లంపల్లి, సాలార్ పూర్ గ్రామాలకు బిటీ రోడ్డు పనులను శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో గ్రామాలు, తాండలకు బిటీ రోడ్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా,పిసిసి సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు నరేందర్, పర్వతాలు, ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు పాల్గొన్నారు.

# నిత్య అభివృద్ధి

ప్రజా సంక్షేమమే తారకమంత్రం



**జగద్గిరిగుట్ట, నవంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

జగద్గిరిగుట్ట డివిజన్ షిర్డీ హిల్స్ కాలనీలో సుమారు 42 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న ఎనిమిది సీసీ రోడ్డు పనులకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య అభివృద్ధి, ప్రజా సంక్షేమమే అభివృద్ధికి తారకమంత్రమని, నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, శ్రీ సాయి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బండ మహేందర్, జనరల్ సెక్రటరీ దినేష్, కోశాధికారి కె.వినోద్ యాదవ్, మహిళా నాయకురాలు త్రివేణి, సీనియర్ నాయకులు బాబు గౌడ్, పాపులు గౌడ్, శశిధర్ ముదిరాజ్, బ్రహ్మానంద చారి, పాపిరెడ్డి, ఆజం, బీఎస్ఆర్ నాని, మెట్ల శ్రీను, విఠల్, నాగరాజు, ముంతాజ్, గిరి, మనోజ్, కొండయ్య సాగర్, రామకృష్ణ సాగర్, హనుమంతు, సాయిలు యాదవ్, బీరప్ప యాదవ్, పండరి, సంతోష్ యాదవ్, క్రిష్ణ, శ్రవణ్, నాగేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి
- సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శిని సన్మానించిన ఎమ్మెల్యే



**కడ్తాల్, నవంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

కడ్తాల్ మండల కేంద్రంలో అల్ఇండియా బంజారా సభ ఢిల్లీలో నిర్వహించి విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ,సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్పతి నాయక్ సన్మానించడం జరిగింది. అనంతరం లక్పతి నాయక్ మాట్లాడుతూ..అల్ ఇండియా లో ఎస్టీ జాబితాలో చేర్చి & గిరిజనులకు 12 శాతం రాజర్వేషన్ కోసమే మా పోరాటం అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రవి కాంత్ గౌడ్,ఏఎంసీ డైరెక్టర్ జోగు వీరయ్య, చందోజీ, సుమన్ గౌడ్, అశోక్, ఇమ్రాన్ బాబా, రాజేందర్ గౌడ్, యాదయ, రాజు, నాయకులు, యువకులు,తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ నాయకుడు గోనె శ్రీనివాస్‌కు బీజేపీలో కీలక బాధ్యత



**బోడుప్పల్, నవంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

బోడుప్పల్ వాస్తవ్యులు, మాజీ వార్డ్ మెంబర్, ప్రస్తుత బోడుప్పల్ మున్సిపల్ పట్టణ బీజేపీ అధ్యక్షులు గోనె శ్రీనివాస్ గురువారం నాడు మేడ్చల్ జిల్లా రూరల్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ N. రాంచంద్రరావు, మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్‌లను కలిశారు.గోనె శ్రీనివాస్ మాట్లాడుతూ, "నా పై నమ్మకంతో మేడ్చల్ జిల్లా రూరల్ ప్రధాన కార్యదర్శి బాధ్యత అప్పగించినందుకు ప్రధాని మోడీ గారికి, రాష్ట్ర నాయకులకు, జిల్లా నాయకులందరికీ కృతజ్ఞతలు. నా రాజకీయ ప్రస్థానానికి ఎల్లప్పుడూ తోడ్పాటు అందించిన బోడుప్పల్ ప్రజలకు, యువతకు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ పదవి నా పై మరింత బాధ్యతను పెంచింది" అని పేర్కొన్నారు.

# విజయవంతంగా ముగిసిన మండల స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు

**మాడుగుల, నవంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

జన విజ్ఞాన వేదిక తెలంగాణ, రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మాడుగుల మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ జడ్.పి.హెచ్.ఎస్ మాడుగుల వేదికగా జరిగింది.మాడుగుల మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సర్దార్ నాయక్ ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ, సైన్సు అభివృద్ధి చెందుతూ అంతరిక్ష పరిశోధనలు అద్భుతంగా సాగుతున్న ఈ సమయంలో కూడా సమాజంలో మూఢనమ్మకాలు, బాణామతి ఆరోపణలు, సైబర్ మోసాలు కొనసాగుతూనే ఉన్నాయని, వాటి నిర్మూలనకై జన విజ్ఞాన వేదిక పోరాడుతోందని, విద్యార్థులు అప్రమత్తంగా మెలగాలని సూచించారు.జన విజ్ఞాన వేదిక రంగారెడ్డి జిల్లా బాధ్యులు, జిహెచ్ఎం లండం పర్వతాలు మాట్లాడుతూ మాడుగుల మండల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. మాడుగుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ మాట్లాడుతూ




మానవ జీవిత సౌలభ్యం కోసం కొత్త ఆవిష్కరణలు అవసరమని, విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ వైకారాలను అలవర్చుకోవాలని విద్యార్థులను ఉద్దేశించి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్లు శ్రీలక్ష్మి, దేవయ్య, లక్ష్మి, కృష్ణ, కరుణాకర్ రెడ్డి, అలాగే వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మండల స్థాయి విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు.మండల స్థాయి పోటీల్లో ప్రభుత్వ తెలుగు మీడియం విభాగం జడ్.పి.హెచ్.ఎస్ ఇర్విన్, ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం విభాగం జడ్.పి.హెచ్.ఎస్ ఇర్విన్, ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్ విభాగం కేజీబీవీ మాడుగుల, ప్రైవేటు ఇంగ్లీష్ మీడియం విభాగం సెయింట్ మేరీస్ హై స్కూల్ మాడుగుల విద్యార్థులు విజేతలుగా నిలిచారు.

# పరిపాలనను ప్రజల చెంతకు తెచ్చిన ఘనత కే.సి.ఆర్‌దే - నిరంజన్ రెడ్డి



**రెవెల్లి, నవంబర్ 21 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

రెవెల్లి మండలంలో నాగపూర్ గ్రామంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, 420 హామీలలో ఒక్కటీ అమలు చేయలేదని తీవ్ర విమర్శలు గుప్పించారు. హామీలు నెరవేర్చని పార్టీకుఓట్లు అడిగే నైతిక హక్కు లేదని అన్నారు. కే.సి.ఆర్ ప్రణాళికాబద్ధ పాలనతో సాగునీళ్లు, ఉచిత కరెంట్, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాల వల్ల ఉత్పత్తులు పెరిగి రైతులు రాజుల్లా బ్రతికారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో సాగునీళ్లు, కరెంట్ అందక అనేక వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును 90% పూర్తి చేసిన కే.సి.ఆర్‌ను ప్రశంసిస్తూ, కేవలం 1000 కోట్లు ఖర్చు చేస్తే 12 లక్షల ఎకరాలకు నీరు అందేదని, కానీ కాంగ్రెస్ ప్రాజెక్టును పాడవు పెట్టిందని ఆరోపించారు.

పరిపాలన సౌలభ్యం కోసం రెవెల్లి, ఎద్దుల మండలాలను ఏర్పాటు చేశానని నిరంజన్ రెడ్డి గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు చీరలు పంపిణీ చేయడం కాంగ్రెస్ కపట నాటకమని, ప్రజలు అప్రమత్తంగా ఉండి బి.ఆర్.ఎస్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రజలతో మమేకమై పనిచేసే నాయకులను పార్టీ ముందుకు తెస్తుందని తెలిపారు.సమావేశంలో గట్టు యాదవ్, తిరుపతి రెడ్డి, భీమన్న, సేనాపతి, మధుసూదన్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేపల పెంపక కేంద్రాన్ని సందర్శించిన అల్ఫోర్స్ విద్యార్థులు



**కరీంనగర్, నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ ఐదవ తరగతి విద్యార్థులు చేపల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మత్స్య సంపద దేశ అభివృద్ధికి, ఆదాయ పెంపుకు కీలకమని, విద్యార్థులు క్షేత్ర పర్యటనల ద్వారా ప్రత్యక్ష అనుభవం పొందుతారని తెలిపారు. విద్యార్థులు చేపల సంరక్షణ విధానం, పోషణ, పెంపక పద్ధతులను తెలుసుకున్నారు. సిబ్బంది జూన్ జూలై నెలల్లో చేపల పెంపకం మరింత విస్తృతంగా జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి. మంజుల, ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది విజయభారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు ఎల్ఎండీ పోలీసుల వినూత్న ప్రయోగం




**తిమ్మాపూర్, నవంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు, వాహనదారులను అప్రమత్తం చేసేందుకు కరీంనగర్ ఎల్ఎండీ పోలీసులు సరికొత్త ఆలోచనతో ముందుకొచ్చారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు తిమ్మాపూర్ మండలంలోని రాజీవ్ రహదారిపై ప్రమాదకరమైన మలుపులు, జంక్షన్ల వద్ద ట్రాఫిక్ పోలీసులను పోలి ఉండే బొమ్మలను ఏర్పాటు చేశారు.నుస్తులాపూర్ నుండి కరీంనగర్ వరకు ఉన్న ప్రధాన యూటర్న్‌లు, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద ప్రయోగాత్మకంగా మొత్తం ఆరు ట్రాఫిక్ పోలీస్ బొమ్మలు, అవసరమైన చోట్ల 30 స్టాపర్లు అమర్చారు. దూరం నుండి వీటిని చూసే వాహనదారులకు సాక్షాత్తు ట్రాఫిక్ పోలీసులు విధుల్లో ఉన్నట్లుగా అనిపించడంతో వారు వేగాన్ని తగ్గించి జాగ్రత్తగా ప్రయాణించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.ప్రమాదాల నివారణ కోసమే ఈ చర్యలు చేపట్టామని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పోలీసులు సూచించారు.

# మహాత్మ నగర్‌లో శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం



**తిమ్మాపూర్, నవంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లో (ఎల్ఎండీ) నూతనంగా నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం నుండి ప్రారంభమయ్యాయి. నవంబర్ 21, 22, 23 తేదీల్లో ప్రతిష్టా మహోత్సవ వేడుకలు, పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.దేవాలయ స్థాపనలో భాగంగా శ్రీ హరి హర పుత్ర ధర్మశాస్తా అయ్యప్ప స్వామి, గణపతి, సుబ్రహ్మణ్య, నాగేంద్ర, పార్వతీదేవి, నవగ్రహ దేవతల విగ్రహాల ప్రతిష్టతో పాటు శిఖరధ్వజ, మహాకుంభాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలను శ్రీ శ్రీ శ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి కరకమలములతో యంత్ర ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, మహా కుంభాభిషేక రూపంలో నిర్వహించనున్నారని నిర్వాహకులు వివరించారు.ప్రతిష్టాపన మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి రోజూ అన్నప్రసాద వితరణ ఉండనుందని పేర్కొన్నారు. హిందూ బంధువులు, అయ్యప్ప భక్తులు అందరూ ఈ మహోత్సవాల్లో పాల్గొని శ్రీ అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

# ఘనంగా అఖండ శివనామం ముగింపు కార్యక్రమం





**అడవిదేవులపల్లి, నవంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కార్తీకమాసం సందర్భంగా అడవిదేవులపల్లి శివాలయంలో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అఖండ శివనామం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. “సాంబ సదాశివ సాంబ సదాశివ సాంబశివ ” అనే నామాన్ని భక్తులు ఏకధాటిగా మూడు రోజులు, 72 గంటలపాటు జపిస్తూ ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి వెల్లటూరు రామ్మోహన్, ఎడవల్లి రఘురామయ్య శర్మ, కూరాకుల రవీంద్రనాథ్, తడికమల్ల మల్లికార్జున్, పసుపులేటి అంజయ్య, బండి పకీరయ్య, శ్రీరామ్ రామకృష్ణ, విడియాల లక్ష్మయ్య, వెంపటి కేశవయ్య, బుద్ధోజు వెంకటాచారి, తిర్రంశెట్టి నాగేశ్వరరావు, కొడిదల బ్రహ్మం, నారబోయిన కిష్టయ్య, మండల సైదులు, దామెర మధు, ఎర్రబోతు దుర్గయ్య, గొడుగు రామకృష్ణ, దుండిగళ్ల కనకయ్య, మంగమ్మ, తడికమల్ల పద్మావతి, కొంగరి లింగమ్మ, బండి జానమ్మ, బండి పకీరమ్మతో పాటు భజన బృందం సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నూతన కరెంట్ సబ్ స్టేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అచ్చంపేట, నవంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అచ్చంపేట మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో నూతన సబ్ స్టేషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు, తమిళనాడు రాష్ట్ర ఎఐసిసి పరిశీలకులు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కొత్త సబ్ స్టేషన్ ఏర్పాటుతో కిష్ట తాండ, బాల్య తాండ, బొమ్మనపల్లి గ్రామాల్లో తక్కువ వోల్టేజ్ సమస్యలు తగ్గి, నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలిపారు. రైతులకు వ్యవసాయ మోటార్లకు సరిపడే విద్యుత్ అందడం ద్వారా పంటలకు సాగు సులభతరం అవుతుందని, ఇళ్లలో ఫ్యాన్లు, లైట్లు, గృహోపకరణాలు సక్రమంగా పనిచేయడానికి వీలవుతుందని పేర్కొన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించిన ఆయన, భవిష్యత్తులో విద్యుత్ రంగానికి, గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. పనులు పూర్తి చేయడంలో సహకరించిన విద్యుత్ శాఖ అధికారులు, ఇంజనీర్లు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలు



**వెల్దండ, నవంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గ్రామ ముదిరాజ్ సంఘం కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవాన్ని కూడా జరిపారు. ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ, ముదిరాజ్‌లను బీసీ –డి నుంచి బీసీ–ఏ వర్గంలోకి మార్చాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ బీసీ కమిషన్ తగిన నిర్ణయాలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం బడ్జెట్‌లో 20,000 కోట్ల రూపాయలు కేటాయించాలని, మత్స్యశాఖకు 3,000 కోట్ల రూపాయలు కేటాయించి వివిధ పథకాల ద్వారా మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు దాటిన ప్రతి మత్స్యకారుడికి వృద్ధాప్య అభయహస్తం ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకారుల డైరెక్టర్ క్యాసరపు వెంకయ్య ముదిరాజ్, జిల్లా నాయకులు బయ్య మల్లయ్య, పిల్లి దేవేందర్ ముదిరాజ్, మహాసభ మండల అధ్యక్షుడు బాదేపల్లి మల్లేష్, మండల యూత్ అధ్యక్షుడు బొక్కల శ్రీనివాస్, నాయకులు రంగరాతి శ్రీశైలం, మారేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ పంటపై అధిక లాభాలు

**-ఉద్యానవన శాఖ అధికారి మహేష్**



**ఎలిగేడు, నవంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్**
: ఎలిగేడు మండలంలోని బురహమియాపేట్ గ్రామానికి చెందిన రైతు గట్ల సంపత్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో 0.6 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ పంటను శుక్రవారం నాటారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారి మహేష్ మాట్లాడుతూ, తక్కువ పెట్టుబడి, తక్కువ ఖర్చుతో అధిక లాభాలు తీసుకోవచ్చే ఆయిల్ ఫామ్ పంటపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్ ఫామ్ పంటకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో సబ్సిడీ అందిస్తున్నందున రైతులు ఈ పంటను సాగు చేసి ఆర్థికంగా బలోపేతం కావచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ గణేష్, ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**- హెల్త్ సూపర్వైజర్ రోజా**



**ఎలిగేడు,నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో శుక్రవారం మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. గర్రెపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రోజా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ, మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును చెడగొట్టే విధంగా ప్రభావం చూపుతాయని, విద్యార్థులు ఇటువంటి దుష్ట అలవాట్లకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. మత్తు పదార్థాల వల్ల శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతాయని, అలవాటు పడితే చదువు, జీవిత లక్ష్యాలు దెబ్బతినే ప్రమాదం ఉందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. సమాజ అభివృద్ధి కోసం విద్యార్థులు ఆరోగ్యంగా ఎదగాలని, ఇలాంటి కార్యక్రమాలను మరింతగా నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణప్రియ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ, ఎంఎల్‌ఎచ్పీ దివ్య, ఏఎన్ఎం రమాదేవి, ఆశ కార్యకర్తలు ఎన్. సుజాత, ఎన్. కోమలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



**అమ్రాబాద్, నవంబర్21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ వేడుకకు బీజేపీ నాయకులు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజీ ఆచారి స్వామి హాజరయ్యారు. కపిలవాయి రవీంద్ర చారి స్వామి కుమారుడు కపిలవాయి గోపి స్వామి ఆహ్వానం మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గంగిశెట్టి నాగరాజు, సాలె తిరుపతయ్య, శంకర్ గౌడ్, గోలి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లోజీ ఆచారి స్వామికి ఘన సన్మానం చేశారు. అయ్యప్ప భక్తులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉజ్వలంగా మార్చారు.

# మహిళా సాధికారతకు పెద్దపేట కాంగ్రెస్

**-ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**పెద్దమందడి నవంబర్ 21( ఆంధ్రప్రభ):**
మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. శుక్రవారం పెద్దమందడి మండలంలోని జగత్పల్లి, మనిగిళ్ళ, పెద్దమందడి, అనకాయపల్లి, దొడగుంటపల్లి, మోజర్ల మద్దిగట్ల, అమ్మపల్లి, చిలకటోనుపల్లి, వెల్టూర్, గట్ల కానాపురం, స్కూల్ తండా, మంగంపల్లి గ్రామాల్లో జరిగిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మహిళలకు చీరలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిర మైండ్లు రేషన్ కార్డులు, ఆదర్శ పాఠశాలల్లో మహిళలకు అధ్యక్ష పదవులు, విద్యార్థులకు ఏకరూప దుస్తుల కుట్టింపు, మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సుల కొనుగోలులో భాగస్వామ్యం, వడ్డీ రహిత రుణాలు వంటి కార్యక్రమాలు మహిళలకు దోహదం చేస్తున్నాయని వివరించారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కోటి మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఫీల్డ్ రోడ్డు సర్వేపనులు నిలిపివేయాలని రైతుల వినతి



**కడ్తాల్, నవంబర్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల పరిధిలోని ఏక్వాయిపల్లి, మర్రిపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి తమ పంట పొలాల గుండా ప్రభుత్వం చేపట్టిన 330 అడుగుల వెడల్పు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు సర్వే పనులను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, తమకు ఉన్న కొద్దిపాటి పంట పొలాల్లో రోడ్డు నిర్మిస్తే కుటుంబాలు రోడ్డున పడతాయని వాపోయారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండ, భూసేకరణ విధి విధానాలు తెలియజేయకుండ సర్వే పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే పనులను నిలిపివేయించి రెండు గ్రామాల పేద రైతులకు మేలు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అగ్రికల్చర్ అధికారికి వినతిపత్రం సమర్పించిన బిఆర్ఎస్ నాయకులు



**కల్వకుర్తి, నవంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కల్వకుర్తి మండలంలో తర్నికల్ గ్రామ రైతుల సమస్యలను పరిష్కరించాలంటూ బిఆర్ఎస్ నాయకులు అగ్రికల్చర్ ఆఫీసర్ సురేష్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. నెల రోజులుగా గ్రామంలో ఏఈఓ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. వర్షాల కారణంగా పంటలు మునిగి నష్టపోయినా అధికారులు ఆన్‌లైన్ చేయకపోవడంతో రైతులు మద్దతు ధర పొందలేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఏఈఓను నియమించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకుడు తాళ్ల సురేష్ గౌడ్ రైతుల తరఫున మాట్లాడారు. రైతులు గుండ్య నాయక్, సోమ్లా నాయక్, తొంట వెంకటయ్య, గొడుగు బాలస్వామి, చాగొండ రాములు, గోపి, వడ్డే యాదయ్య, వడ్డే అంజి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ కోకో కోచింగ్ క్యాంప్ ప్రారంభం



**నాగర్‌కర్నూల్, నవంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 44వ జూనియర్స్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలబాలిక జట్ల కోకో కోచింగ్ క్యాంప్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగర్‌కర్నూల్ టౌన్ ఎస్సై గోవర్ధన్, మాజీ కౌన్సిలర్ నిజాం హాజరై కోకో పూజా నిర్వహించి క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై గోవర్ధన్ మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడల్లోనూ క్రమశిక్షణతో ఉండాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే సమాజంలో మంచి క్రీడాకారులుగా, మంచి పౌరులుగా ఎదగగలమని సూచించారు. కోచింగ్ క్యాంప్‌లో నేర్చుకున్న మెలకువలతో రాష్ట్రస్థాయిలో రాణించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మాజీ కౌన్సిలర్ నిజాం మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్‌లో కోచింగ్ క్యాంప్ నిర్వహించడం ఎంతో సంతోషకరమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాలు సాధించి జిల్లాకు గౌరవం తీసుకురావాలని క్రీడాకారులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖోఖో ఇన్‌చార్జి నిరంజన్ యాదవ్, జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగేశ్వరరావు, మాజీ కార్యదర్శి పాండు, సీనియర్ ఖోఖో క్రీడాకారులు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, ఎన్ఐఎస్ కోచ్ కృష్ణ మోగులాల్, రవికుమార్, కల్వకుర్తి రమేష్, జట్టి లక్ష్మి, తులసి, రాఘవులు గౌడ్, అరుణ రామన్ గౌడ్, భాస్కర్, కోకో అసోసియేషన్ ఇన్‌చార్జి సామా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతిపై హరీష్ ఆరోపణలు నిరాధారం

## రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



**హైదరాబాద్, నవంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మాజీ మంత్రి హరీష్ రావు భూ భారతి చట్టం అమలు విషయంలో చేసిన ఆరోపణలను రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఖండించారు. ఆయన మాట్లాడుతూ, హరీష్ రావు లేవనెత్తిన అంశాలన్నీ బిఆర్ఎస్ హయాంలోనే జరిగినవని, తమ తప్పిదాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై రుద్దడం తగదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి విధానం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సమస్యల పరిష్కారం కోసం కోర్టుల చుట్టూ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. అంతేకాదు రైతుల భూ రికార్డులు, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతా వివరాలను అమెరికా కంపెనీకి అప్పగించడం కూడా గత ప్రభుత్వమే చేశిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి, భూ భారతి చట్టాన్ని యుద్ధ ప్రాతిపదికన అమల్లోకి తెచ్చిందని కోదండరెడ్డి తెలిపారు. రైతుల వద్దకే రెవెన్యూ అధికారులను పంపి దరఖాస్తులు స్వీకరించడం, సాదాబైనామా క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించడం, ధరణి పోర్టల్‌ను ప్రభుత్వ రంగ సంస్థ NIC కి అప్పగించడం వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు. భూ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేయడానికి గ్రామ స్థాయిలో పరిపాలన అధికారులను, మండల స్థాయిలో లైసెన్స్ సర్వేయర్లను నియమించారని, గత ఆరు నెలల్లో భూ భారతి అమలుకోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇప్పటివరకు కమిషన్ కార్యాలయానికి వచ్చిన మూడు వేల మంది రైతుల సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక రెవెన్యూ అధికారులతో మాట్లాడి మార్గాలు చూపినట్లు చెప్పారు. గతంలో రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేసి, ఒక ఎమ్మార్వో మరణానికి, రైతుల ఆత్మహత్యలకు, గొడవలకు కారణమైనది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని కోదండరెడ్డి విమర్శించారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో భూమి ఉన్న ప్రతి రైతుకు హక్కు కల్పించేలా చట్టం తీసుకువచ్చి, దాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.

# అచ్చంపేట మదీనా మసీదులో అభివృద్ధి కార్యక్రమం



**అచ్చంపేట, నవంబర్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అచ్చంపేట పట్టణంలోని మదీనా మసీదులో 12 లక్షల రూపాయలతో నూతన భవనం నిర్మాణానికి భూమి పూజ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, తమిళనాడు రాష్ట్ర ఎఐసిసి పరిశీలకులు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "మీ అందరికీ నా హృదయపూర్వక అస్సలాము అలైకుమ్. మదీనా మసీదు పునర్నిర్మాణానికి సంబంధించిన ఈ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనడం నాకు గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. మసీదు కేవలం ప్రార్థనా స్థలం మాత్రమే కాదు, ఇది సామాజిక ఐక్యతకు, సామరస్యానికి, మానవత్వానికి ప్రతీక. వేరువేరు మతాలు, సంస్కృతులు ఉన్నా మనందరి లక్ష్యం శాంతి, సంతోషమే. ఈ నూతన మసీదు మన బంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది" అని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రార్థనా స్థలాల అభివృద్ధి ప్రాంతీయ సామాజిక అభివృద్ధిలో భాగమని, మసీదు నిర్మాణానికి అవసరమైన నిధులు, సహకారం అందించడంలో ఎప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేకు ఘన సన్మానం చేశారు. అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, మస్జిద్ కమిటీ అధ్యక్షుడు సిద్ధిక్, సెక్రటరీ మఖ్బుల్, మున్సిపల్ కాప్షన్ మెంబర్ ఖాదర్, నిరంజన్, షావలి, దర్గా కమిటీ చైర్మన్ రఫీ, మదీనా మసీదు ఇమామ్ అబ్రార్, మైనారిటీ సోదరులు, భక్తులు పాల్గొన్నారు.

# ఆహారం వృధా చేయకూడదు

## ధనపురి సాగర్



**కరీంనగర్, నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హోమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో "అన్నం పరబ్రహ్మస్వరూపం దానిని వృధా చేయడం మహా పాపం" అనే నినాదంతో ముద్రించిన వాల్ పోస్టర్‌ను పాఠశాల ప్రధానాచార్యులు రాజమౌళి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ మాట్లాడుతూ, ఆకలితో అలమటిస్తున్న ఎంతోమందికి అన్నాన్ని ప్రసాదించాలని ప్రతిరోజూ భగవంతుని కోరుకోవాలని విద్యార్థులకు సూచించారు. భారతదేశంలో ఇంకా 19 కోట్ల మందికిపైగా ఒకపూట భోజనం లేక అలమటిస్తున్నారని గుర్తుచేస్తూ, ఆహారం వృధా చేయకుండా చూడటం మన అందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఒక కిలో బియ్యం మన చేతికి రావడానికి సుమారు 2500 నుండి 4000 లీటర్ల నీరు అవసరమవుతుందని, ఆహారాన్ని వృధా చేస్తే పరోక్షంగా నీటినీ వృధా చేసినట్టే అవుతుందని ధనపురి సాగర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు రాజమౌళి, మహేష్, జి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాతంత్ర మహిళా సంఘ 14వ జాతీయ మహాసభలకు పిలుపు



**అమ్రాబాద్,నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జనవరి 25 నుండి 28 వరకు హైదరాబాద్‌లో జరగనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 14వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని అచ్చంపేట టౌన్ కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు ఏ. నిర్మల, జిల్లా నాయకురాలు సైదమ్మ మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై హింస, అత్యాచారాలు, ఆత్మహత్యలు విపరీతంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. జమ్మూ కాశ్మీర్‌లోని కతువా గ్రామంలో అసిఫాపై జరిగిన దారుణం, గుజరాత్‌లో 2002లో బిల్‌కిస్ బానోపై జరిగిన సామూహిక అత్యాచారం ఘటనలను గుర్తుచేస్తూ, నేరస్థులను విడుదల చేయడం సిగ్గుచేటయిన విషయమని విమర్శించారు. దేశంలో అనేక చోట్ల దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నా మహిళల రక్షణ కోసం చట్టాలు అమలులో విఫలమవుతున్నాయని పేర్కొన్నారు. మహిళల హక్కుల కోసం, రక్షణ కోసం, సమానత్వం కోసం జరగనున్న జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళలు సక్కమ్మ, లక్ష్మమ్మ, నారమ్మ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మనోహరాబాద్ మండల విద్యాధికారిగా పి. వెంకటస్వామి



**మనోహరాబాద్, నవంబర్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మనోహరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. వెంకటస్వామి మండల విద్యాధికారిగా నూతన బాధ్యతలు చేపట్టారు. మండల విద్యాధికారి మల్లేశం స్థానంలో ఆయన నియామకం జరిగింది. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ, మండలంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి కృషి చేస్తానని, శతశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గతంలోనూ ఇక్కడ పనిచేసిన అనుభవం తనకు ఉన్నదని, ఆ అనుభవాన్ని ఉపయోగించి విద్యా రంగంలో మరింత అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన వెంకటస్వామికి సహచర ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలుపుతూ ఘనంగా సన్మానం చేశారు.

# కొంపాల్లీ మున్సిపాలిటీ ఉద్యోగుల వేతన సమస్యపై ఆవేదన



**కొంపల్లి, నవంబర్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మెడ్చల్–మల్కాజిగిరి జిల్లా కొంపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న పూర్వ గ్రామపంచాయతీ ఉద్యోగులు తమ వేతనాలు, అలవెన్సులు, రెగ్యులరైజేషన్ అంశాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 2019 నుండి వేతనాల విషయంలో అన్యాయం జరుగుతోందని షేక్ జబ్బార్, సతయ్య, వసంత, అప్పలరాజు, రమేశ్ బాబు, మహేష్, భాస్కర్, సీతారాం రాజు తదితరులు తెలిపారు. పలుమార్లు కమిషనర్‌కు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదని వారు ఆరోపించారు. హైదరాబాద్ హైకోర్టు 11120/2019లో ఇచ్చిన ఆదేశాల ప్రకారం 2019 ఆగస్టు నెలలో తాము సూపర్వైజర్లు, ఎలక్ట్రీషియన్లు, అటెండర్లు, స్వీపర్లు, బిల్ కలెక్టర్లుగా పరిగణించి తగిన వేతనాలు చెల్లించాలని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ అధికారులు ఇప్పటికీ ఆదేశాలు అమలు చేయలేదని ఉద్యోగులు దుయ్యబట్టారు. "రోజువారీ జీవనం కూడా కష్టంగా మారింది. మా కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కోర్టు ఆదేశాలు ఉన్నా కనీస కనికరమూ లేకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు" అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వేతనాలు, అలవెన్సులు చెల్లించి తగిన ర్యాంక్ ప్రకారం జీతాలను ఇవ్వాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ విషయాన్ని కొంపాల్లీ మున్సిపాలిటీ అధికారికంగా ధృవీకరించింది.

# మహేశ్వరం భూములపై మైనారిటీ స్కూల్ నిర్మాణం ఎందుకు అందెల శ్రీరాములు ప్రశ్న



**బడంగ్‌పేట్ నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో 50 ఎకరాల భూభాగంలో హైదరాబాద్ జిల్లాకు చెందిన మైనారిటీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణం జరుగుతోందని తెలిసి, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ అందెల శ్రీరాములు శుక్రవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ముందుగా సీతారామచంద్ర స్వామి ఆలయం, పెద్దమ్మతల్లి ఆలయం, రంగనాయకుల స్వామి ఆలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, "ఈ భూమిలో అనేక దేవాలయాలకు సంబంధించిన ఆస్తులు ఉన్నాయి. నియోజకవర్గానికి సంబంధం లేని హైదరాబాద్ జిల్లాకు చెందిన మైనారిటీ స్కూల్‌ను ఇక్కడ ఎందుకు నిర్మించాలి గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రభుత్వానికి చాలానే ఖాళీ స్థలాలు ఉన్నాయి. వాటిని వదిలి మహేశ్వరం భూములను ఎందుకు ఎంచుకున్నారు " అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో దేవాలయ భూములను ఇండస్ట్రీలకు ఇచ్చి, ప్రత్యామ్నాయంగా ఒక్క గజం భూమి కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. సూర్యగిరి ఎల్లమ్మతల్లి ఆలయానికి రోడ్డు సౌకర్యం లేకపోవడం, హిందువుల ఆస్తులకు రక్షణ లేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం కారణమని ఆయన విమర్శించారు. "హిందూ దేవాలయ భూములను పట్టించుకోని ప్రభుత్వం, హామీ చేసిన అభివృద్ధి పనులను మధ్యలో ఆపేసి, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అవసరం లేని పనులు చేస్తోంది. ఇది మహేశ్వరం ప్రజలపై అన్యాయం. ఇక్కడ ఎట్టి పరిస్థితుల్లోనూ మైనారిటీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణాన్ని అనుమతించము. ప్రభుత్వం వెంటనే నిర్ణయం వెనక్కి తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక ప్రజలతో సమావేశమై వారి అభ్యంతరాలను విన్న ఆయన, "ఇది నియోజకవర్గ గౌరవానికి, ప్రజల హక్కులకు జరిగిన దాడి. మహేశ్వరం దేవాలయ భూములను రక్షించడం మా బాధ్యత. ఈ పోరాటంలో వెనక్కి తగ్గే ప్రశ్నే లేదు" అని స్పష్టం చేశారు.

# ఘనంగా జేఎన్టీయూహెచ్ డైమండ్ జూబ్లీ ఉత్సవాలు



**కూకట్పల్లి, నవంబర్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కూకట్పల్లి జేఎన్టీయూహెచ్‌లో డైమండ్ జూబ్లీ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు సమాజానికి తమ వంతు సహాయం చేయాలని సూచించారు. జేఎన్టీయూ అధికారులతో పాటు పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్, పుష్పారెడ్డి, ఫణి కుమార్, కొప్పిశెట్టి దినేష్, గంధం రాజు, శివా చౌదరి, మధు తదితరులు పాల్గొన్నారు.

# అధర్మంపై ధర్మం గెలుపు

**-మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**



**మహేశ్వరం, నవంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, "లోకల్ బాడీ ఎన్నికల విజయానికి సంకేతంగా ఒక నెల ముందే విజయం సాధించిన పిఎసిఎస్ చైర్మన్‌లను కొనసాగించాలని హైకోర్టు స్పష్టంగా తీర్పు ఇవ్వడం న్యాయస్థానంపై మరింత నమ్మకం పెంచింది. అధర్మంపై ధర్మం గెలిచింది" అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా మహేశ్వరం, కందుకూర్ మండలాల సొసైటీ చైర్మన్‌లను తొలగించి, జీవో ద్వారా కొత్త వారిని నియమించిందని, హైకోర్టు ఆ నియామకాలను రద్దు చేసి పాత చైర్మన్‌లను కొనసాగించాలని స్పష్టం చేసిందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్వరం మండల కేంద్రంలో పిఎసిఎస్ చైర్మన్ మంచే పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటరెడ్డి, డైరెక్టర్లతో కలిసి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో పండుగ వాతావరణం నెలకొంది. మాజీ మంత్రికి ప్రతి ఒక్కరూ ధన్యవాదాలు తెలిపారు.

# పోలీసుల పై పెరిగిన భరోసా

**- 'డయల్ 100' అద్భుత విజయం**



**కరీంనగర్ నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

"ఆపదొస్తే 100కి కాల్ చేయండి.. పోలీసులు క్షణాల్లో మీ ముందుంటారు" అనే నినాదం కరీంనగర్ కమీషనరేట్‌లో వందశాతం అమలవుతోంది. ప్రజలకు పోలీసులపై నమ్మకం రెట్టింపవుతోంది. గడిచిన పది నెలల్లో ఏకంగా 43,105 మంది బాధితులకు పోలీసులు అండగా నిలిచారు. చిన్న గొడవలు పెద్ద సమస్యలుగా మారకముందే పోలీసులు జోక్యం చేసుకుని కౌన్సిలింగ్ ఇచ్చి శాంతిభద్రతలను కాపాడుతున్నారు. మహిళల్లో ధైర్యం పెరిగి, 5,641 మంది ఫిర్యాదులు చేశారు. రోడ్డు ప్రమాదాల్లో 2,288 ఘటనల్లో, ఆత్మహత్యాయత్నాల్లో 561 ఘటనల్లో పోలీసులు సమయానికి స్పందించి ప్రాణాలను కాపాడారు. అత్యధిక సేవలు అందించిన స్టేషన్లలో కరీంనగర్ టూ టౌన్ (5,176), వన్ టౌన్ (5,006), కొత్తపల్లి (3,803) ముందంజలో ఉన్నాయి. "డయల్ 100" సేవలు ప్రజల రక్షణ కవచమని ఈ గణాంకాలు స్పష్టంగా చెబుతున్నాయి. పోలీసు కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, న్యూసెన్స్ కాల్స్ అధికంగా రావడం ఆందోళనకరమని, అత్యవసర పరిస్థితుల్లోనే ఈ సేవను వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



**అపూజలోయ్యప్ప స్వామి దేవాలయం ప్రతిష్ట పూజలోపాల్గొన్న మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు**

# మహేశ్వరం గడ్డ బిఆర్ఎస్ అడ్డ : పాండు యాదవ్




**మహేశ్వరం,నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలో పిఎసిఎస్ చైర్మన్ మంచే పాండు యాదవ్ మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా మహేశ్వరం, కందుకూరు మండలాల సొసైటీ చైర్మన్‌లను తొలగించింది. అడ్డదారి జీవోలతో బిఆర్ఎస్ నేతలను తొలగించి, కాంగ్రెస్‌కు చెందిన వారిని నియమించడం పట్ల మేము కోర్టుకు వెళ్లాం. హైకోర్టు తక్షణమే పాత చైర్మన్‌లను యథావిధిగా కొనసాగించాలని స్పష్టం చేసింది" అని తెలిపారు. తనతో పాటు వైస్ చైర్మన్ వెంకటరెడ్డి, డైరెక్టర్లను తిరిగి నియమించడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన పాండు యాదవ్, "ఆధర్మంపై ధర్మం గెలిచింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలుపు చూపిస్తాం" అని ధైర్యంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నందుకు మహేశ్వరం ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది.

## కందుకూరులో తెలంగాణ జాగృతి కార్యాలయాన్ని ప్రారంభించిన కల్వకుంట్ల కవిత





**కందుకూర్ నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండల కేంద్రంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జాగృతి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జనం బాటలో భాగంగా రెండు రోజులపాటు రంగారెడ్డి జిల్లాలో పర్యటిస్తూ, మహేశ్వరం ప్రజలకు ఉన్న అనేక సమస్యల పరిష్కారంపై స్థానికులతో, మేధావులతో చర్చించామని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు పాండురంగ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయం ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని ఆకాంక్షించారు. "మహేశ్వరం అంటేనే లక్కీ అనే పేరు ఉంది. జాగృతికి కూడా శుభం జరగాలి. గతంలో ఉద్యమంలో పనిచేసిన జాగృతి కార్యకర్తలు మళ్లీ సొంతగూటికి చేరుకుంటున్నారు. పెద్ద ఎత్తున చేరుతూ జాగృతిని మరింత బలోపేతం చేయాలి" అని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

# వరంగల్ ట్రై సిటీ హాఫ్ మారథాన్ విజయవంతం చేయాలి




**హనుమకొండ నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

చరిత్ర కలిగిన మహానగరమైన వరంగల్‌లో తొలిసారిగా హాఫ్ మారథాన్ ఈ నెల 23న కాళోజీ కళాక్షేత్రం నుంచి ప్రారంభమవుతుంది. తెలంగాణ రన్నర్స్, వరంగల్ రన్నర్స్ సంఘం ఆధ్వర్యంలో, క్రెడాయ్ వరంగల్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం నగరానికి మరింత ప్రాచుర్యం తెస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ మారథాన్‌లో 5 కిలోమీటర్లు, 10 కిలోమీటర్లు, 21.1 కిలోమీటర్ల విభాగాల్లో పోటీలు జరుగుతాయి. విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఉదయం 5 గంటలకు 21.1 కిలోమీటర్ల రన్, 6 గంటలకు 10 కిలోమీటర్ల రన్, 7 గంటలకు 5 కిలోమీటర్ల రన్ ప్రారంభమై ఉదయం 9 గంటలకు ముగుస్తుంది. అనంతరం హయగ్రీవాచారి మైదానంలో బహుమతుల ప్రదానం జరుగుతుంది. జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్, ఎన్పీడీసీఎల్ చైర్మన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ఇప్పటి వరకు 2600 మంది రన్నర్స్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మార్గమంతా నీటి, వైద్య, మొబైల్ టాయిలెట్ సదుపాయాలు కల్పించడంతో పాటు ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ వాలంటీర్లు సేవలందించనున్నారు. "వరంగల్ మహానగర కీర్తి మరింత బలోపేతం కావాలని, ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో ఈ మారథాన్‌ను నిర్వహిస్తాం. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలి" అని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# మహేశ్వరం ఆర్టీసీ బస్సులో కిచ్చన్న మహిళలతో ముచ్చట



**మహేశ్వరం నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో ప్రతి బీద కుటుంబాన్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఆడపడుచులకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల నెలకు రూ.3000 నుంచి రూ.4000 వరకు ఆదా అవుతుందని ఆయన పేర్కొన్నారు. మహేశ్వరం పట్టణంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణించి పలువురు మహిళా ప్రయాణికులతో ముచ్చటించిన లక్ష్మారెడ్డి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మహేశ్వరం డిపో ద్వారా రోజూ 36 వేల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని ఆయన వివరించారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడి త్వరలోనే మహేశ్వరం, కందుకూరు మండలాల ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మార్కెట్ కమిటీ, దేవాలయ కమిటీ సభ్యులు, ఇందిరమ్మ కమిటీలు, గ్రామ, బూత్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మేడారం గ్రామంలో 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన

**-రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడం ప్రజా ప్రభుత్వం ప్రధాన కర్తవ్యము:**
**-ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్.**



**దేవరకొండ నవంబర్ 21. (నీలగిరి ఎక్స్ ప్రెస్)** నల్లగొండ జిల్లా,పీఏపల్లి మండలం మేడారం గ్రామ అభివృద్ధిలో భాగంగా రూ. 2 కోట్లు 10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించబోయే 33/11 కేవీ సబ్ స్టేషన్ పనులకు నేడు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శంకుస్థాపన చేసి భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా కీలకం అని, రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.లో వోల్టేజ్ సమస్యలతో ఇబ్బందులు పడ్డ రైతులకు ఇకపై అలాంటి సమస్యలు సంభవించకుండా పూర్తి పర్యవేక్షణతో సబ్ స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు.ఈ సబ్ స్టేషన్ ఏర్పాటుతో మేడారంతో పాటు పరిసర గ్రామాల్లో విద్యుత్ వోల్టేజ్ నిలకడగా ఉండి, వ్యవసాయ మోటార్లు, నీటి పారుదల వ్యవస్థలు మరింత సమర్థంగా పనిచేస్తాయని అన్నారు.అదేవిధంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు అందించడంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.మేడారం గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా వ్యవసాయ రంగం మాత్రమే కాకుండా గ్రామీణ జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. సబ్ స్టేషన్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి అయ్యేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి కార్యకర్తలు, యువజన నాయకులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అప్పుల బాధతో షాపుకు నిప్పు

**- కుట్రను ఛేదించిన కరీంనగర్ పోలీసులు**



**కరీంనగర్,నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ నగరంలోని కోర్టు చౌరస్తాలో గల మహాలక్ష్మి ఫ్యాషన్ మాల్లో ఈ నెల 17న ఉదయం జరిగిన అగ్నిప్రమాదం కేసును త్రీ టౌన్ పోలీసులు ఛేదించారు. ఇది ప్రమాదవశాత్తు జరిగినది కాదని, ఇన్సూరెన్స్ డబ్బుల కోసం యజమానే ఉద్దేశపూర్వకంగా చేసిన పని అని పోలీసులు తేల్చారు.వ్యాపారంలో నష్టాలు, అప్పుల బాధ ఎక్కువ కావడంతో షాపు యజమాని సంగం రాజేశ్ ఇన్సూరెన్స్ డబ్బులు పొందాలని పథకం వేసి, తన వద్ద పనిచేసే రాకేశ్, మధుతో కలిసి కుట్ర పన్నాడు. ముందుగా విలువైన బట్టలను రహస్యంగా తరలించి, అనంతరం పెట్రోల్ పోసి షాపుకు నిప్పంటించారు. అనంతరం ఏమీ తెలియనట్లు నటిస్తూ రాజేశ్ డయల్ 100కు ఫోన్ చేసి ప్రమాదంగా చూపించే ప్రయత్నం చేశాడు.పోలీసులు లోతుగా విచారణ జరిపి, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. నేరానికి వాడిన పెట్రోల్ బాటిల్, సెల్‌ఫోన్, తరలించిన బట్టలను స్వాధీనం చేసుకున్నారు. చివరికి షాపు యజమాని సంగం రాజేశ్, వర్కర్ రాకేశ్, గుమస్తా మధును అరెస్టు చేశారు.త్రీ టౌన్ పోలీస్ ఇన్స్పెక్టర్ జాన్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు ఛేదించబడింది.

## తకియా కరీముల్లా షా సాహెబ్ స్మశాన వాటిక ప్రచార కార్యదర్శిగా ఇక్రమ్ అహ్మద్ సిద్ధిఖి



**కరీంనగర్,నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ హుస్సేనీపురలోని తకియా కరీముల్లా షా సాహెబ్ ముస్లిం మైనారిటీ స్మశాన వాటిక సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శిగా ఎం.ఏ. ఇక్రమ్ అహ్మద్ సిద్ధిఖి (ఇక్రమ్ సికెందర్) నియమితులయ్యారు. సంఘం అధ్యక్షులు సయ్యద్ సులేమాన్ తవక్కలి నేడు నియామక ఉత్తర్వులు జారీ చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఒక రూపాయి పథకంలో భాగంగా పేద ముస్లింల అంతిమ యాత్ర (ఆఖరీ సఫర్) నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. ఇక్రమ్ అహ్మద్ సిద్ధిఖి కాపువాడ ముస్లిం స్మశాన వాటికలో అభివృద్ధి పనులు, రూపాయికి అంత్యక్రియలు నిర్వహణకు సంబంధించిన కార్యక్రమాలను పర్యవేక్షించే బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు.తనకు ఈ బాధ్యత అప్పగించడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన ఇక్రమ్ అహ్మద్ సిద్ధిఖి, నిజాయితీగా విధి నిర్వహణ చేపట్టి, పేద ,ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరికి సేవ చేయాలని సంకల్పించారు. తనను నియమించిన సంఘ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కళాశాలల్లో ముఖ సంబంధ బయోమెట్రిక్ తప్పనిసరి

**-ఉపకులపతి ఉమేష్ కుమార్**




**కరీంనగర్ నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని డిగ్రీ, పీజీ ప్రభుత్వ, ప్రైవేటు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్, సెక్రటరీలు, కరస్పాండెంట్లు, ఇన్‌చార్జిలతో జరిగిన సమావేశంలో ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు అన్ని కళాశాలల్లో విద్యార్థులకు ముఖ సంబంధ బయోమెట్రిక్ తప్పనిసరి చేయాలని సూచించారు. దాని అమలు కోసం సంబంధిత అధికారులు కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు.విశ్వవిద్యాలయ ఆవరణలోని అన్ని కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతల సిబ్బందికి కూడా ముఖ సంబంధ బయోమెట్రిక్ అమలు చేస్తున్నామని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ మాట్లాడుతూ, బయోమెట్రిక్ వలన విద్యార్థుల్లో క్రమశిక్షణ పెరిగి, తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతారని, దాంతో జ్ఞాన సముపార్జన జరిగి మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.అన్ని కళాశాలల్లో తప్పనిసరిగా బయోమెట్రిక్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి. సురేష్ కుమార్, ఓఎస్డీ టు విసి డాక్టర్ బి. హరికాంత్, విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సరసిజ పాల్గొన్నారు.

## మాలల రణభేరి బహిరంగ సభకు పోస్టర్ ఆవిష్కరణ



**హుస్నాబాద్,నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మాల మహానాడు ఆధ్వర్యంలో హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో ఈరోజు మాలల రణభేరి బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. "హలో మాల- చలో హైదరాబాద్" పేరుతో ఈ సభ నవంబర్ 23న ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు సరూర్నగర్ వేదికగా ప్రారంభం కానుంది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సుప్రీం కోర్టు సూచనలకు విరుద్ధంగా 2011 జనాభా లెక్కల ఆధారంగా సరైన ఎంపిరికల్ డేటా లేకుండా చేసిన ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపును పునఃసమీక్షించి జీవో 99ను సవరించి మాలలతో పాటు గ్రూప్-3లో ఉన్న మరో 25 కులాలకు న్యాయం చేయాలని కోరారు. చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎస్సీల రిజర్వేషన్ శాతం పెంచాలని, పెండింగ్‌లో ఉన్న ఎస్సీ విద్యార్థుల స్కాలర్షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, మాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల నిధులను కేటాయించాలని, ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల వినియోగంపై శ్వేతపత్రం విడుదల చేసి నిధులను దుర్వినియోగం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జ్ బోజు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు యాస శ్రీనివాస్, హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు నోముల బాలయ్య, లీగల్ సెల్ అడ్వైజర్ చావుల రాజమౌళి, సావుల శ్రీనివాస్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఆరే శరత్, లీగల్ సెల్ రిపోర్టర్ బోడుమల్ల సంపత్, బత్తుల రాజయ్య, వెన్న రాజయ్య, మాశం కొమురయ్య, గిరిమల్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంక్షేమ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

**కలెక్టర్ కుమార్ దీపక్**




**మంచిర్యాల నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ప్రజావాణి కార్యక్రమంలో వృద్ధులకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎవరూ లేని వృద్ధులను ఓల్డ్ ఏజ్ హోమ్స్, స్వచ్ఛంధ సంస్థల సహాయంతో సంరక్షిస్తున్నామని, ట్రిబ్యునల్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి సహాయం అందిస్తున్నామని చెప్పారు. వృద్ధుల దరఖాస్తులను పోలీసు, రెవెన్యూ సిబ్బంది సానుకూల దృష్టితో చూడాలని సూచించారు.వృద్ధులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు, అప్పీలు, ఎవిక్షన్ ఆర్డర్లు చేసుకోవచ్చని, సీనియర్ సిటిజన్స్ యాక్ట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ వివరించారు. శారీరక, మానసిక ఇబ్బందులను రెవెన్యూ, పోలీస్, సంక్షేమ శాఖల సమన్వయంతో పరిష్కరిస్తామని తెలిపారు.రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, వృద్ధుల సంరక్షణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సందర్భంగా జల సంరక్షణలో జాతీయ అవార్డు పొందిన కలెక్టర్‌ను విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. వృద్ధులను గౌరవించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కలెక్టర్‌పై ప్రత్యేక పాట పాడి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, వృద్ధులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సిద్ధిపేటలో ఈవీఎం గోదాం పరిశీలించిన జిల్లా కలెక్టర్

**సిద్ధిపేట నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లా కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం కలెక్టరేట్ పక్కనగల ఈవీఎం గోదాంను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నెలవారీ తనిఖీ భాగంగా గోదాం చుట్టూ రక్షణ చర్యలను పరిశీలించి, లాగ్‌బుక్‌ను పరిశీలించి విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేశారు.ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం గోదాం చుట్టూ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, పోలీసుల 24 గంటల బందోబస్తు, రెవెన్యూ అధికారుల తరచు పర్యవేక్షణపై కలెక్టర్ సూచనలు చేశారు.



# పోషణ, ఆరోగ్యంపై శుక్రవారం సభలో అవగాహన

**కరీంనగర్ నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహిళలు తమ ఆరోగ్యం, పిల్లల పోషణపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ అంగన్వాడి కేంద్రంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రతి మహిళకు పోషణ, ఆరోగ్యం వంటి విషయాలపై అవగాహన కలుగుతోందని, అంగన్వాడీ టీచర్లు సృజనాత్మకంగా ఆట వస్తువులు తయారు చేసి చిన్నారులకు మంచి అలవాట్లు, క్రమశిక్షణ నేర్పుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న కార్యక్రమాలతో మంచి




ఫలితాలు వస్తున్నాయని, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బీపీ, షుగర్ వంటి వ్యాధులకు పరీక్షలతో పాటు మందులు ఉచితంగా అందిస్తున్నామని, అవసరమైతే ఇంటి వద్దకే మాత్రలు అందజేస్తామని చెప్పారు. ప్రతి మహిళ ఆరోగ్య మహిళ ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఉచిత పరీక్షల ద్వారా అనేకమందిలో వ్యాధులు ముందుగానే గుర్తించి చికిత్స అందించామని తెలిపారు. అంగన్వాడీ చిన్నారులు కథలు, పాటలు చెప్పి ఆకట్టుకోగా, గర్భిణీలు, బాలింతలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, సిడిపిఓ సబిత తదితరులు పాల్గొన్నారు.

# యువత ప్రతిభ వెలికితీయటానికి యువజన ఉత్సవాలు దోహదం

## కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
యువతలో ఉన్న ప్రతిభను వెలికి తీయటానికి యువజన ఉత్సవాలు ఎంతో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టేడియంలో శుక్రవారం జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు నిర్వహించారు. సాంస్కృతిక పోటీలు, వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ పమేలా సత్పతి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో ఏదో ఒక కళ ఉంటుందని, దానిని వెలికి తీయటానికి యువజన ఉత్సవాలు వేదికవుతాయని అన్నారు. యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకొని సన్మార్గంలో పయనించాలని, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. సామాజిక



సేవలో కృషి చేసిన యువజన స్వచ్ఛంద సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి మెమెంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా నలుమూల నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించగా, సైన్స్ మేళా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, యువజన క్రీడా శాఖాధికారి వి. శ్రీనివాస్ గౌడ్, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్ ప్రకాష్, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, జాతీయ, రాష్ట్ర, జిల్లా యువజన అవార్డు గ్రహీతలు, యోగా అసోసియేషన్ అధ్యక్షులు, బాలభవన్ అధికారులు, యువజన ప్రతినిధులు, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. సాంస్కృతిక సారథి కళాకారుల ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన వారిలో జానపద నృత్యం గౌతమి గ్రూప్ (లంబాడీ డాన్స్), జానపద గేయం నక్క శివరాం గ్రూప్, కథ రచన మౌనిక, పెయింటింగ్ పాయల్, ఉపన్యాసం వైశాలి, కవిత్వం నళిని, సైన్స్ మేళా అక్షయ, అమూల్య ఉన్నారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

# నాగారం గ్రామంలో ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

**హుస్నాబాద్ నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవాన్ని హుస్నాబాద్ మండలం నాగారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు పొన్నబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యం వహించారు. నియోజకవర్గ గౌరవాధ్యక్షులు పెండ్యాల ఐలయ్య, అక్కనపేట అధ్యక్షుడు గంగాధర్ రాజయ్య, హుస్నాబాద్ అధ్యక్షుడు పొన్నం మల్లయ్య, రేగొండ అధ్యక్షుడు ఎడల వనేష్, పోతారం అధ్యక్షుడు సున్నపు రమేష్, పొట్లపల్లి ఉపాధ్యక్షుడు మౌటం రాజయ్య, గౌరవాధ్యక్షుడు మేడబోయిన చంద్రమౌళి,




హుస్నాబాద్ కార్యదర్శి రాగుల శ్రీనివాస్, నాగారం ఉపాధ్యక్షుడు పెసరు రాజయ్యతో పాటు ముదిరాజ్ మహాసభ యువ నాయకులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా మత్స్యకారుల జీవితం మాత్రం మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారుల కార్పొరేషన్‌కు వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని, ఎలాంటి షరతులు లేకుండా సభ్యత్వాలు ఇవ్వాలని, బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, చెరువులు -కుంటలపై ముత్రాసి, తెనుగు, బెస్త, ముదిరాజ్, గంగపుత్ర, గూండ్ల కులాలకు మాత్రమే హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండ్యాల ఐలయ్య మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ -డి నుండి బీసీ-ఏ వర్గానికి మార్చాలని, చేప పిల్లలను పూర్తిస్థాయిలో అందించాలని, 50 ఏళ్లు నిండిన ప్రతి మత్స్యకారునికి వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని కోరారు.

# మల్కాపూర్ దినేష్ హత్య కేసు మిస్టరీ ఛేదన

**కరీంనగర్, నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన కవ్వంపల్లి దినేష్ (40) అనుమానాస్పద హత్య కేసును చొప్పదండి పోలీసులు ఛేదించారు. భూ తగాదాలు, వ్యక్తిగత కక్షల నేపథ్యంలో పథకం ప్రకారం జరిగిన ఈ హత్యలో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. దేవునూరి సతీష్, దినేష్ మధ్య భూమి అమ్మకం కమీషన్ గొడవలు ఉండగా, మరో నిందితుడు దేవునూరి సంతోష్ వ్యక్తిగత కారణాలతో దినేష్‌ను చంపుతానని బెదిరింపులు ఎదుర్కొన్నాడు. దీంతో సంతోష్ తన అన్న శ్రావణ్‌తో కలిసి దినేష్‌ను అంతమొందించాలని నిర్ణయించారు. ఫిబ్రవరి 25, 2024న శ్రావణ్ వదిన మరణంతో గ్రామానికి వచ్చిన దినేష్‌ను ముందస్తు ప్రణాళిక ప్రకారం మద్యం తాగించించి, మల్కాపూర్ కెనాల్ వద్దకు తీసుకెళ్లి నిందితులు దాడి చేశారు. అనంతరం కారులో ఎక్కించి నూకపల్లి శివారులో తాడుతో మెడ బిగించి హత్య చేసి, చేతులు, కాళ్లు కట్టి చొప్పదండి కెనాల్‌లో




పడేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన దేవునూరి సతీష్, శ్రావణ్‌లు గతంలో గంగాధరలో ఒక వృద్ధురాలిని హత్య చేసిన కేసులో కూడా నిందితులుగా జైలుకు వెళ్లిన చరిత్ర ఉందని పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా చొప్పదండి సి.ఐ. ప్రదీప్ కుమార్ సిబ్బందితో కలిసి శ్రావణ్ ఇంటి వద్ద దాడి చేసి ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించగా, హత్యకు ఉపయోగించిన కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు ఛేదనలో కృషి చేసిన చొప్పదండి, కొత్తపల్లి, గంగాధర, రామడుగు పోలీసు సిబ్బందిని కమిషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు.

# మత్స్యకారుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలి : కొలిపాక నర్సయ్య



**పెద్దపల్లి నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను సమష్టిగా ఎదుర్కొంటూ ఐక్యతను చాటుకోవాలని మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షులు కొలిపాక నర్సయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొలిపాక నర్సయ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మత్స్య కార్మికులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం ముదిరాజులకు, మత్స్య కార్మికుల కోసం చేప పిల్లలు, రొయ్యల పిల్లలను కోట్ల సంఖ్యలో ఉచితంగా సరఫరా చేసి, వలలు, మోపెడ్‌లు, ఆటోలు వంటి పరికరాలను 75 శాతం సబ్సిడీపై అందించిందని గుర్తు చేశారు. అలాగే హైదరాబాద్‌లో ముదిరాజ్ భవన నిర్మాణానికి ఐదెకరాల స్థలం కేటాయించి, ప్రమాద బీమా మొత్తాన్ని రూ. 6 లక్షలకు పెంచిందని, పంచాయతీ చెరువులను మత్స్య శాఖకు బదిలీ చేసి జీవనోపాధికి తోడ్పడిందని వివరించారు. కానీ గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టలేదని, మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని కోరారు.

# హుస్నాబాద్ చేపల మార్కెట్‌లో ఘనంగా మత్స్యకార దినోత్సవం



**హుస్నాబాద్ నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని హుస్నాబాద్ చేపల మార్కెట్‌లో ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి జనవేని శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చేపల విక్రయదారులను సన్మానించి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1954 నవంబర్ 21న చేప పిల్లల సంపర్కంతో అనేక చేపలు పుట్టిన సంఘటనను గుర్తు చేస్తూ, ఆ రోజు నుండి ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం జరుపుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడు ఎడల రమేష్, ఉపాధ్యక్షుడు కేశవేని రమేష్, హుస్నాబాద్ టౌన్ అధ్యక్షుడు రాగుల శ్రీనివాస్, అక్కన్నపేట అధ్యక్షుడు కాశబోయిన రవి, మత్స్య శాఖ అధ్యక్షుడు పోన్నం మల్లయ్యతో పాటు పలువురు నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

# గాయత్రి విద్యానికేతన్ ప్రతిభకు జిల్లా స్థాయి గుర్తింపు



**పెద్దపల్లి, నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన “కృతజ్ఞత ౯ పరిపూర్ణ జీవనమునకు మార్గం” అనే అంశంపై వ్యాస రచన పోటీలో గాయత్రి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థిని అమీమా తహరీమ్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించింది. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా గారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా సెప్టెంబర్ 10, 2025న జరిగిన ఈ పోటీలో ఆమె ప్రతిభను గుర్తిస్తూ శ్రీ సత్యసాయి అచీవ్‌మెంట్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ విజయాన్ని గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజని దేవి, ప్రిన్సిపల్ విజయ్, వైస్ ప్రిన్సిపల్ ప్రియాంకతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. అమీమా తహరీమ్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# చిగురుమామిడి 10వ వార్డులో మోరీ సమస్య తీవ్రం





## అధికారుల అలసత్వం పై ప్రజల్లో అసహనం

**హుస్నాబాద్, నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చిగురుమామిడి మండలం గ్రామంలోని 10వ వార్డు ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న మోరీ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత పాలకుల నిర్లక్ష్యం, అవగాహన రాహిత్యంతో ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న ఈ మోరీ కారణంగా ప్రస్తుతం పరిస్థితి దారుణంగా మారింది.రోడ్డుమీద మురుగునీరు చేరడంతో కాలినడకన వెళ్లేవారికి ఇబ్బంది, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోజురోజుకు రోడ్డు దెబ్బతింటూ పూర్తిగా పాడైపోయే స్థాయికి చేరింది. ఎన్నిసార్లు గ్రామపంచాయతీ కార్యదర్శి, సంబంధిత ఉన్నతాధికారులకు సమస్యను



తెలియజేసినా ఇప్పటిదాకా ఎలాంటి చర్యలు కనిపించకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది.

ఇక గ్రామంలో పెరిగిపోయిన కోతుల ఉచ్చాటన సమస్య కూడా ప్రజలను రోజూ భయాందోళనలకు గురిచేస్తోంది. పంటలకు, ఇంటి పరిసరాలకు నష్టం వాటిల్లుతుండగా చిన్నారులు బయటికి రావడానికే భయపడే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో చిగురుమామిడి బీజేపీ మోరీ పనులను త్వరితగతిన పూర్తి చేసి మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, దెబ్బతిన్న రోడ్డు మరమ్మతులు తక్షణం చేపట్టాలని, కోతుల సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. "ప్రజా సమస్యలపై మా పోరాటం కొనసాగుతుంది. ప్రజలతోనే మేముంటాం" అని బీజేపీ బూత్ అధ్యక్షులు దొంత కర్ణకర్ స్పష్టం చేశారు.

# మత్స్యకారుల జీవనానికి భద్రత కల్పించాలి

**పెద్దపల్లి, నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రాష్ట్ర ఆర్థిక వనరులకు ప్రధాన ఆధారంగా నిలుస్తున్న మత్స్యకారులను చిన్నచూపు చూడటం తగదని, వారి జీవనానికి భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని ప్రగతి మత్స్య కార్మిక సేవాసమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఉస్తేం శ్రీనివాస్ స్పష్టం చేశారు.ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంథని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పోతరేని క్రాంతి కుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముదిరాజ్‌లను బీసీ–డీ నుండి బీసీ–ఏ కేటగిరీకి మార్చాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా వినతులు చేసినా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. దాదాపు 60 లక్షల పైచిలుకు ఉన్న ముదిరాజుల ఓటు బ్యాంకును గుర్తించాలని, లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో తమ ఐక్యతను ప్రదర్శించి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీ జాప్యం, కొత్త పథకాల ప్రవేశంలో ఆలస్యం, వలలు,



పడవలు, ఐస్ ఫ్యాక్టరీలు, డబ్బాలు వంటి పరికరాల కొరతపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వృత్తి ప్రమాదాల బారిన పడే మత్స్యకారులకు బీమా సౌకర్యం కల్పించి, ప్రమాదం జరిగిన వెంటనే ఆ మొత్తాన్ని కుటుంబాలకు అందించాలని కోరారు.ఈ సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకుని మత్స్యకారుల హక్కులను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా కారు పాకల రమేష్, ప్రణాళిక కమిటీ చైర్మన్‌గా నూనె రాజేశం, పెద్దపల్లి జిల్లా యూత్ అధ్యక్షుడిగా తలారి సాగర్, జిల్లా ఉపాధ్యక్షులు దామ సదయ్య, కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షురాలు కొరిమి పద్మ, కొడిమ్యాల మండల అధ్యక్షురాలు తునికి వనజ, పెద్దపల్లి మండల ఉపాధ్యక్షులు తీగల ధర్మపురి, సుల్తానాబాద్ మండల ఉపాధ్యక్షుడిగా చొప్పరి సత్యపాల్‌లను నియమిస్తూ వారికి నియామక పత్రాలను అందజేశారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీలోకి భారీ చేరికలు

**పెద్దపల్లి, నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ బలోపేతం అవుతున్న క్రమంలో, పెద్దపల్లి జిల్లాలో శుక్రవారం ఆ పార్టీలోకి భారీగా చేరికలు చోటుచేసుకున్నాయి. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, బీసీ ఉద్యమ నాయకులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు రవి ఆదేశాల మేరకు జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో టీఆర్‌పీలో చేరారు.కొత్తగా చేరిన సభ్యులను పార్టీ సీనియర్ నాయకులు గుండేవేన స్వామి, జిల్లా అధ్యక్షులు కాసిపేట్ ఉదయ్, ప్రధాన కార్యదర్శి చల్ల సాయికృష్ణ పటేల్ సాదరంగా ఆహ్వానించారు. వారికి పార్టీ కండువాలు కప్పి క్రియాశీలక సభ్యులుగా గుర్తింపు ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మల్లన్న పోరాటం, పార్టీ



సిద్ధాంతాలకు ఆకర్షితులై అనేకమంది యువకులు, ప్రజాభిమానం ఉన్న నాయకులు టీఆర్‌పీలో చేరుతున్నారని తెలిపారు.పార్టీ విస్తరణలో భాగంగా కొత్తగా చేరిన పలువురు కార్యకర్తలకు కీలక బాధ్యతలు అప్పగించారు. వారిలో కొందరిని తక్షణమే సోషల్ మీడియా మండలం కన్వీనర్‌లుగా నియమించినట్లు జిల్లా నాయకత్వం ప్రకటించింది. సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను, పార్టీ లక్ష్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వారికి దిశానిర్దేశం చేశారు.జిల్లా అధ్యక్షులు కాసిపేట్ ఉదయ్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ఏకైక లక్ష్యమని, అందరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. మల్లన్న ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని, నిస్వార్థ సేవతోనే ప్రజల విశ్వాసాన్ని పొందవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ అడ్లూరి గంగారాం తో పాటు పెద్ద సంఖ్యలో మండల, గ్రామ స్థాయి కార్యకర్తలు, కొత్తగా చేరిన నాయకులు పాల్గొన్నారు.

# రామడుగు మండల స్థాయి చెకుముకి సంబరాలు

### - టాలెంట్ టెస్ట్



**రామడుగు, నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రామడుగు మండలంలో చెకుముకి సంబరాల భాగంగా జెడ్‌పిహెచ్ఎస్ రామడుగులో టాలెంట్ టెస్ట్ ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి రంగనాథ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలో వివిధ పాఠశాలల విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రంగనాథ శర్మ మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించే దిశగా ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం టాలెంట్ టెస్టులో విజేతల పేర్లు ప్రకటించారు. జెడ్‌పిహెచ్ఎస్ వెధిర ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్. భువనచంద్ర, జి. అరవింద్, కే. అక్షిత ప్రథమ స్థానాన్ని సాధించారు.రామడుగు మండలం తరపున వీరిని జిల్లా స్థాయికి పంపనున్నట్లు మండల విద్యాధికారి తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ




**కరీంనగర్, నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ రూరల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నగునూరులో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. హుజురాబాద్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు గంగిశెట్టి జగదీశ్వర్ తమ మాతృమూర్తి గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ద్వారా ఈ ప్యాడ్లను అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాసుల రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి తోడ్పడే ఈ కార్యక్రమం పాఠశాల వాతావరణంలో సానుకూలతను కలిగించింది.

# పలు క్రిమినల్ కేసుల్లో నిందితుడికి రౌడీ షీట్ ఓపెన్ - అరెస్టు



**కరీంనగర్ రూరల్, నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ పట్టణంలోని వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్ మరియు రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్న తిరుపతి నితిన్ వర్ధన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఇతడి పై ఇప్పటికే రౌడీ షీట్ ఓపెన్ చేయబడగా, 2024లో నమోదైన రెండు తగాదా కేసుల్లో అరెస్టు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు.విశ్వసనీయ సమాచారం ఆధారంగా కరీంనగర్ రూరల్ పోలీసులు చాకచక్యంగా అతడిని పట్టుకొని కోర్టుకు హాజరు పరిచారు.వివరాల్లోకి వెళితే, ఫిర్యాదుదారు పంబాల శ్రీనివాస్ కార్తికేయ నగర్ తీగులుటపల్లి ప్రాంతంలో ఉన్న భూమిని నిందితుడు తప్పుడు లీగల్ హేర్ సర్టిఫికెట్‌తో కబ్జా చేయాలని ప్రయత్నించాడు. అలాగే బెదిరింపులు చేసి డబ్బులు వసూలు చేయాలని యత్నించాడు. ఈ కేసులో అతనితో పాటు మరో ముగ్గురిపై కూడా కేసు నమోదు చేశారు.మరో కేసులో ఫిర్యాదుదారుని మోసం చేసి, డబ్బులు తీసుకొని భూమి రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పి తప్పించుకున్నాడు. అప్పటి నుండి పోలీసులకు దొరకకుండా తిరుగుతుండగా, చివరికి రూరల్ పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరు పరిచారు.ఈ కేసు వివరాలను కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి వెల్లడించారు.

# చొరబాటుదారులకు కొన్ని పార్టీల అండ..

మమతాబెనర్జీకి అమిత్ షా కౌంటర్



**న్యూఢిల్లీనవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అక్రమంగా దేశంలోకి వస్తున్న చొరబాటుదారులను కొన్ని రాజకీయ పార్టీలు రక్షించే ప్రయత్నం చేస్తున్నాయని కేంద్ర హోంమంత్రి  అమిత్ షా పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి  మమతాబెనర్జీ  ని ఉద్దేశించి ఆయన పరోక్షంగా ఈ వ్యాఖ్యలు చేశారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ  పై మమతాబెనర్జి సీఈసీ జ్ఞానేశ్వర్‌కు లేఖ రాసిన నేపథ్యంలో అమిత్ షా 'ఎక్స్' వేదికగా ఈ విధంగా స్పందించారు. కొన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు చొరబాటుదారులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. చొరబాటుదారులను అడ్డుకోవడం దేశ భద్రతకు ఎంతో కీలకమని చెప్పారు.ప్రజాస్వామ్య పరిరక్షణకు చొరబాట్లను నిరోధించాల్సిన అవసరం ఉందని, కానీ కొన్ని రాజకీయ పార్టీలు చొరబాటుదారులను సమర్థించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. అయితే ఆయన నేరుగా మమతా బెనర్జి పేరును ప్రస్తావించలేదు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిలిపివేయాలని విపక్షాల నుంచి డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో షా పై వ్యాఖ్యలు చేశారు.కాగా, ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ మమతాబెనర్జీ సీఈసీకి లేఖ రాశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ బెంగాల్‌లో అరాచకంగా, బలవంతంగా, ప్రమాదకరంగా సాగుతోందని ఆరోపించారు. ప్రణాళిక లేకుండా, స్పష్టమైన సమాచారం లేకుండానే ఎస్ఐఆర్ చేపట్టారని మండిపడ్డారు. ఎస్ఐఆర్‌లో పాల్గొంటున్న అధికారులు అసాధారణ పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని తెలిపారు.

# రాత్రివేళల్లో ప్రకాశవంతంగా వెలుగులీనుతున్న ఢిల్లీ..

- ఫొటోలు షేర్ చేసిన ఐఎస్ఎస్



**న్యూఢిల్లీ-నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాత్రి వేళల్లో ప్రకాశవంతంగా వెలుగులీనే ప్రపంచంలోని ప్రధాన నగరాలకు చెందిన ఫొటోలను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం  తాజాగా విడుదల చేసింది. ఆ ఫొటోల్లో మన దేశ రాజధాని ఢిల్లీ  కాంతులీనుతూ అద్భుతంగా, ఆకర్షణీయంగా కనిపించింది.ఐఎస్ఎస్.. ప్రపంచంలోనే అందమైన నగరాలైన టోక్యో, సింగపూర్ వంటి ప్రముఖ నగరాల ఫొటోలను రిలీజ్ చేసింది. ఆ నగరాలు రాత్రిపూట  కాంతులీనుతూ ఎంతో అందంగా కనిపించాయి. వాటితో సమానంగా ఢిల్లీ కూడా ఆకర్షణీయంగా కనిపించడం విశేషం. ఈ ఫొటోలో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ కూడా కనిపించింది. రాత్రి 10.54 గంటల సమయంలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ దృశ్యాలను చిత్రీకరించినట్లు ఐఎస్ఎస్ వెల్లడించింది. ఐఎస్ఎస్ నుంచి కనిపించే అత్యంత ప్రకాశవంతమైన పట్టణాల్లో సింగపూర్, టోక్యో, సావోపాతోపాటూ ఢిల్లీ నగరం కూడా ఉన్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఈ ఫొటో వైరల్ అవుతున్నాయి.

# కర్ణాటక సీఎం సిద్ధరామయ్యే..

- మేం ఆయనతో కలిసి పనిచేస్తాం : డీకే




**న్యూఢిల్లీ-నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కర్ణాటక  లో సిద్ధరామయ్య ను సీఎం పదవి నుంచి తొలగించి ఉప ముఖ్యమంత్రి  డీకే శివకుమార్ కు ఆ పదవిని కట్టబెట్టబోతున్నారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. కర్ణాటక కాంగ్రెస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు తాజాగా పార్టీ జాతీయాధ్యక్షుడు  మల్లికార్జున్ ఖర్గే తో డిన్నర్‌లో పాల్గొనడం ఈ ఊహాగానాలకు తెరతీసింది.అయితే డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఈ డ్రామాకు తెరదించారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్యేనని చెప్పారు. పూర్తికాలం ఆయనే సీఎంగా కొనసాగుతారని చెప్పారు. తామంతా ఆయనతో కలిసి పని చేస్తామని అన్నారు. ఖర్గేతో ఎమ్మెల్యేల సమావేశం గురించి ప్రశ్నించగా.. వాళ్లు పీసీసీ అధ్యక్ష పదవి, నాలుగైదు డిప్యూటీ సీఎం పదవులను కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు.ఇలాంటి మీటింగ్‌లు గత రెండున్నరేళ్లుగా కొనసాగుతున్నాయని డీకే చెప్పారు. ఇందులో కొత్తదనం ఏమీ లేదని అన్నారు. వాళ్లు ఇలాంటి మీటింగ్‌లు ఇంకా మరిన్ని పెట్టుకోనీయని వ్యాఖ్యానించారు.

# పాలకవర్గం లేక బల్దియాలో పెచ్చరిల్లిన అవినీతి

**స్వచ్ఛ సర్వేక్షన్ నిధుల గోల్‌మాల్‌పై విజిలెన్స్ విచారణ జరిపించాలి : గుగ్గిల్లపు రమేశ్**



**కరీంనగర్, నవంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగరపాలక సంస్థలో పాలకవర్గం లేక ప్రత్యేక అధికారుల పాలనలోనూ అవినీతి పెరుగుతోందని మాజీ డిప్యూటీ మేయర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిల్లపు రమేశ్ ఆరోపించారు. శుక్రవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమం ద్వారా విడుదల చేసిన రూ.30 లక్షల నిధులు బల్దియాకు ప్రత్యేక అధికారిగా ఉన్న కలెక్టర్ హయాంలో గోల్‌మాల్ కావడం ఏమిటని ప్రశ్నించారు.స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమం అమలులో ఇప్పటివరకు వచ్చిన నిధుల వినియోగంపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. వాల్పెయింటింగ్లు వేయకుండా, హోర్డింగ్స్ ఏర్పాటు చేయకుండా, ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండా కొంతమంది అధికారులు ఉన్నతాధికారులను ప్రభావితం చేసి రూ.30 లక్షల అవినీతి బాగోతానికి తెరలేపారని తీవ్ర విమర్శలు చేశారు.దేశవ్యాప్తంగా పట్టణాలు, నగరాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఇలాంటి అవినీతి కారణంగా కరీంనగర్ ర్యాంక్ పడిపోయిందని రమేశ్ పేర్కొన్నారు. నగరంలో ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పించకపోయినా, వాల్పెయింటింగ్స్, హోర్డింగ్స్ పేరిట పెద్ద ఎత్తున బిల్లులు తీసుకోవడం అధికారుల అవినీతికి నిదర్శనమని అన్నారు.ఈ ఏడాది ఒక కార్యక్రమాన్ని మినహాయిస్తే మిగతా కార్యక్రమాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన కోరారు. వాల్పెయింటింగ్స్, హోర్డింగ్స్ పేరిట రూ.30 లక్షల బిల్లులు చేయడం అవినీతికి పరాకాష్టగా మారిందని ఆరోపించారు.కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రత్యేక అధికారిగా ఉన్న జిల్లా కలెక్టర్ స్పందించి, స్వచ్ఛ సర్వేక్షన్ నిధుల గోల్‌మాల్‌పై విచారణ అధికారిని నియమించి లోతుగా దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేశారు. అవినీతికి పాల్పడిన అధికారులను గుర్తించి సర్వీస్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు.

# అప్పుల వలయం
# యువత ఆర్థిక స్వేచ్ఛకు పెనుభారం

## ఈయంఐల ప్రలోభానికి లొంగిపోతున్న కొత్త తరం









**సాంకేతిక ప్రగతి**
ఉన్నత జీవనశైలిపై ఆకర్షణ
సొంత డబ్బు లేకుండానే సొగసైన జీవితం
కొనుక్కోవాలనే కోరిక
ఈ మూడు కలిసి నేటి యువతను అప్పుల
ఆధారిత జీవన విధానంలోకి
నెట్టేస్తున్నాయి. బ్యాంకులు, ఫిన్‌టెక్
కంపెనీలు, క్రెడిట్ కార్డు సంస్థలు – "ఇప్పుడే
పొందండి  తర్వాత చెల్లించండి" అని
చేతులు చాచి నిలబడుతున్నాయి. అందరూ
ఇస్తున్నారు కాబట్టి మనకు అవసరం ఉన్నట్లు
భావిస్తున్నాం!

**అవసరాలు ఆసక్తులు కలిసిపోయిన కాలం**
ఇంటర్నెట్, మొబైల్ యాప్‌లు, రాయితీలు – ఇవి
కొనుగోళ్లను ఒక క్లిక్ దూరంలో ఉంచాయి.
**ముందు:** డబ్బు ఉంటే కొనాలి
**ఇప్పుడు**: అభిలాష ఉంటే కొనాలి
కానీ
ఈ అభిలాషల వెనుక కనిపించని వడ్డీ బాంబులు
దాగి ఉన్నాయి.

**కనబడని అప్పు గొలుసులు**
చిన్న ఈయంఐతో మొదలైనది
తర్వాత మరో గాడ్జెట్
**ఆపై బైక్**
చివరికి క్రెడిట్ కార్డుల మీద ఆధారపడే దశ
ఇలా నెలసరి చెల్లింపుల బంధనం యువతను
ఆర్థికంగా బానిసలుగా మార్చేస్తోంది.
**సంపాదిస్తే**
దాని ముందు భాగం వడ్డీ చెల్లింపుల్లోకి
వెళ్లిపోతుంది
స్వేచ్ఛగా జీవించడానికి సంపాదిస్తున్నట్టు
భావిస్తున్నా
**యథార్థంలో**
సంపాదన అంతా అప్పు తీర్చడానికి పని
చేస్తోంది!

**క్రెడిట్ స్కోర్**
**కొత్త కాలపు శిక్షణ**
క్రెడిట్ స్కోర్ ఒక భయం
ఈయంఐలు ఒక బాధ
ఈ రెండూ కలిసి యువత జీవన నిర్ణయాలపై
కన్నెం తిప్పని కట్టుబాట్లు విధిస్తున్నాయి.
**"స్వేచ్ఛగా ఖర్చు చేస్తున్నామనుకుంటాం**
కానీ మనకంటే ముందు బ్యాంకులు మన డబ్బు
కోసం ప్లాన్ చేసుకున్నాయి."
**ఆర్థిక అజ్ఞానం = భవిష్యత్తు దివాళా**
స్కూల్లో ఎన్నో సబ్జెక్టులు నేర్పినా
డబ్బు ఎలా నిర్వహించుకోవాలి?  ఎవరూ
చెప్పరు!
**ఫలితం:**
ఉద్యోగం వచ్చిన వెంటనే
అప్పు తీసుకోవడం మొదటి నిర్ణయం!
**కానీ అప్పు:**
పెట్టుబడులకు ఉపయోగిస్తే ? సంపద
ఖర్చులకు ఉపయోగిస్తే ? పతనం
**దురదృష్టవశాత్తూ**
యువత మెజారిటీ రెండో మార్గానికే
వెళ్తున్నారు.

**జాగ్రత్తలు  ఆర్థిక స్వేచ్ఛ కోసం చర్యలు**
అవసరమైతే మాత్రమే లోన్
తక్కువ వడ్డీ – తక్కువ వ్యవధి
ఒప్పందంలోని ప్రతీ అక్షరాన్ని
చదవాలి
ఈయంఐలను ఎప్పటికీ ఆలస్యం
చేయకూడదు
ఆకర్షణలకి దూరంగా ఉండాలి
ఇన్వెస్ట్మెంట్  సేవింగ్స్ అలవాటు
పెంచుకోవాలి
డబ్బును నియంత్రించేవాడు సంపన్నుడు
**డబ్బు నియంత్రిస్తే బానిసుడు.**
**అప్పు పూర్తిగా తప్పు కాదు**
కానీ అవగాహన లేకుండా తీసుకుంటే
అది కొత్త యుగ దాస్యమే.
**నేటి యువత**
స్టేటస్ కోసం కాకుండా-స్థిరత్వం కోసం
జీవించడం నేర్చుకుంటే
భవిష్యత్తు ఆర్థికంగా బలంగా నిలుస్తుంది.
ప్రగతి ముఖం పెట్టుకొని అప్పు గొలుసులు
వేసుకోవద్దు
ఆర్థిక స్వేచ్ఛే అసలైన విజయబాట.

**వ్యాసకర్త**
శ్రీకాంత్ రెడ్డి బాగే
ఐటీ రంగ నిపుణులు






# స్పైథ్రిల్లర్ చిత్రంలో ప్రియాంక



ప్రియాంక మోహన్ కన్నడంలో బంపరాఫర్‌ను దక్కించుకుంది. 'సప్తసాగరాలు దాటి' ఫేమ్ దర్శకుడు హేమంత్ రావు డైరెక్షన్‌లో '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' పేరుతో ఓ స్పై థ్రిల్లర్ తెరకెక్కనుంది. ధనంజయ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్ కీలకమైన అతిథి పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా సెట్స్‌లో ప్రియాంక మోహన్ జాయిన్ అయింది. ఈ విషయాన్ని సోషల్‌మీడియా ద్వారా వెల్లడించారు మేకర్స్. 1980 దశకంలో నడిచే ఈ పీరియాడిక్ కథలో ప్రియాంక మోహన్ పాత్ర నవ్యరీతిలో ఉంటుందని చెబుతున్నారు. శివరాజ్‌కుమార్‌గారి సినిమాలు చూస్తూ పెరిగానని, ఆయన సినిమాలో భాగం కావడంతో తన కల నిజమైందని, కన్నడంలో తనకు బ్రేక్ నిచ్చే చిత్రమవుతుందని ప్రియాంక మోహన్ ఆనందం వ్యక్తం చేసింది.

# ఓటీటీలోకి వచ్చేసిన 'ది ఫ్యామిలీ మ్యాన్' సీజన్ 3

ఇండియన్ పాపులర్ వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్' సీజన్ 3 ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక ప్రైమ్ వీడియోలో ఈ వెబ్ సిరీస్ ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్ రెండు భాగాలుగా విడుదలై అమెజాన్ ప్రైమ్‌లో రికార్డులు సృష్టించింది. ఇప్పుడు ఇదే వెబ్ సిరీస్‌కి పార్ట్ 3 వచ్చింది. మొదటి రెండు సీజన్‌లకు దర్శకత్వం వహించిన రాజ్ & డీకే ఈ సీజన్‌కి కూడా దర్శకత్వం వహించారు. ఇందులో పాతాళ్ లోక్ నటుడు జైదీప్ అహ్లావత్ విలన్‌గా కనిపించబోతుండగా ఈ చిత్రం నార్త్ ఈస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చింది.




# అరుంధతి పాత్ర చాలా ఇష్టం అన్న భాగ్యశ్రీ



అరుంధతీ'లో అనుష్క చేసిన తరహా పాత్రలంటే ఇష్టం అని నటి భాగ్యశ్రీ భోర్సే అన్నారు. రామ్ పోతినేని హీరోగా నటించిన 'ఆంధ్రా కింగ్ తాలుకా' చిత్రంలో ఆమె కథానాయికగా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలోమహేష్ బాబు.పి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 27న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే విలేకర్లతో మాట్లాడారు. నాకోసం ఎలాంటి కథలు రాసిపెట్టి ఉన్నాయో నాకు తెలియదు. వచ్చిన ప్రతి క్యారెక్టర్‌కి వందశాతం న్యాయం చేసేలా పని చేస్తా. వెర్సటైల్ యాక్ట్రెస్‌గా పేరు తెచ్చుకోవాలని కోరిక. ' అలాంటి పాత్రలు నాకూ వస్తాయని ఆశిస్తున్నా' అని భాగ్యశ్రీ భోర్సే అన్నారు. సినిమాలో మహాలక్ష్మి క్యారెక్టర్‌లో కనిపిస్తాను. కాలేజ్ గోయింగ్ గర్ల్. సాగర్‌తో ప్రేమలో ఉంటుంది. అంతకుమించి ఇప్పుడు ఎక్కువ క్యారెక్టర్ గురించి రివీల్ చేయకూడదు. కథకు ఈ పాత్ర చాలా ఇంపార్టెంట్.. అదేంటి అనేది తెరపైనే చూడాలి. నా పాత్రను ఆడియన్స్ తప్పకుండా గుర్తుపెట్టుకుంటారు. ఇందులో ప్రేమ కథ చాలా స్వచ్ఛంగా ఉంటుంది. లవ్ స్టోరీ, డైలాగ్స్ చాలా బ్యూటిఫుల్‌గా ఉంటాయి. రామ్‌తో పనిచేయడం అమేజింగ్ ఎక్స్‌పీరియన్స్. అతని ఎనర్జీకి మ్యాచ్ చేశానని అనుకుంటున్నాను. సినిమా ఓ ఇంపార్టెంట్ సీన్‌ను దర్శకుడు వివరించారు. ఆ సన్నివేశాన్ని నేను ఎలా అనుకుంటున్నానో చేసి చూపిస్తానని దర్శకుడిని రిక్వెస్ట్ చేశా. నేను చేసింది అందరికీ నచ్చింది. అంత క్రియేటివ్ స్పేస్ ఇవ్వడం ఆనందం కలిగించింది. నిర్మాత సంస్థ కూడా అంతే స్పేస్ ఇచ్చింది. కాంప్రమైజ్ కాకుండా సినిమా తీశారు. ఈ సినిమాలో తులసీ, రావు రమేశ్, మురళి శర్మ వంటి అద్భుతమైన ఆర్టిస్ట్‌లతో పని చేశా. వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ఉపేంద్రగారితో నాకు ఒక్క సీనే ఉంది. ఆయన వెరీ హంబుల్, డౌట్ టు ఎర్త్ యాక్టర్. ఆయనతో వర్క్ చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. అభిమానం అనేది డివైన్ ఎమోషన్. నేను నార్త్ నుంచి సౌత్ కొచ్చినప్పుడు ఇక్కడ ప్రేక్షకులు చూపించిన అభిమానానికి ఒక స్టార్‌ని ఇంతగా అభిమానిస్తారా అన్నది ప్రత్యక్షంగా చూశా. చాలా గొప్ప ఎమోషన్ అది. ఎలాంటి రిలేషన్ లేకుండా పరిచయం లేకుండా ఒక వ్యక్తిని అంతలా ఎలా అభిమానిస్తారని ఆశ్చర్యపోయా. మహేశ్ ఈ కథ చెప్పిన తర్వాత అభిమానం అన్నదానికి ఆన్సర్ దొరికింది. రెండు సినిమాలకే మంచి పేరు, ఫ్యాన్ ఫాలోయింగ్ పెరిగింది అంటుంటే చాలా ఆనందంగా ఉంది. ఆర్టిస్ట్‌కు మాత్రమే ఆ అదృష్టం ఉంటుంది.

# ప్రభాస్ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్..

## 'ది రాజా సాబ్' ఫస్ట్ సింగిల్ ఆ రోజే!

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ది రాజా సాబ్' సినిమాకు సంబంధించిన కీలక అప్‌డేట్ విడుదలైంది. హారర్ చిత్రాల దర్శకుడు మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్ 'ది రాజా సాబ్' నుంచి మొట్టమొదటి పాట విడుదల తేదీని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ రెబల్ సాబ్ ను నవంబర్ 23న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తుండగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, జరీనా వాహాబ్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తుండగా బోమన్ ఇరానీ, సంజయ్ దత్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు.

# భన్సాలీ ప్రొడక్షన్ నుంచి మరో లవ్ స్టోరీ

బాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు జీ స్టూడియోస్, భన్సాలీ ప్రొడక్షన్స్ కలిసి ఒక భారీ ప్రాజెక్ట్‌ను నిర్మించబోతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కి 'దో దీవానే షెహర్ మే' అనే టైటిల్‌ను ఖరారు చేయగా.. ఇందులో బాలీవుడ్ నటుడు సిద్ధాంత్ చతుర్వేది, మృణాల్ ఠాకూర్ జంటగా నటించబోతున్నారు. లవ్ స్టోరీగా రాబోతున్న ఈ చిత్రంకి రవి ఉద్యవార్ దర్శకత్వం వహిస్తుండగా.. సంజయ్ లీలా భన్సాలీ, ప్రేరణ సింగ్, ఉమేష్ కుమార్ బన్సాల్, భరత్ కుమార్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 26న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి అనౌన్స్‌మెంట్ వీడియోను పంచుకుంది చిత్రయూనిట్. ఈ టీజర్ చూస్తుంటే మెట్రో లవ్‌స్టోరీగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది.

